చిన్న నవల

అల్పజీవి



శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

★

(గత సంచిక తరువాయి)

8

"ఇంత దురవస్థ ఎన్నడూ ఎరగను."

అనుకున్నాడు సుబ్బయ్య ఆరాత్రి వెంకట్రావుతో మాట్లాడివస్తూ.

వర్ణించ వీలులేనంతగా ఉంది అతని మనఃక్లేశం. తీరి కూర్చొని అంతా పీకలమీదకి తెచ్చుకున్నానే అని దుఃఖించేడు.

అతనికి వెంకట్రావు మీద చాలా కోపం వచ్చింది.

పట్టూ పట్టూ మని ఒచ్చి నా గొంతుక మీద కూర్చున్నాడు అయిదు వందలు కావాలని.

"నీ దగ్గిర అయిదువందలుంటాయని రాలేదుస్మా" అన్నాడారోజు.

నేను బీదవాణ్ణని నన్ను చూస్తే నిరసన.

మరయితే నా దగ్గిర కెందుకొచ్చాడో!

తను మహా అంత గొప్పవాడయితే అయిదు వందలకోసం నన్నడగడ మెందుకు?

ఇప్పుడిలా పట్టిచేతుల్తో పంపడ మెందుకు?

ఇవ్వలేనని చెప్పెయ్య కూడదూ?

అయినా, నాదే పొరపాటు! వెంకట్రావు అడగమనగానే వెళ్లి ఆమట్టుకి గవరయ్యని నేనడిగెయ్యాలా?

అడిగినా, అతను ఇవ్వడం ఏంఖర్మం ఒచ్చింది!

బావుంది! అతని అవసరం ఉండి అతనిచ్చేడు.

బిల్సులో ఏమైనా సదుపాయం చేస్తాననుకున్నాడు.

అమ్మమ్మోయ్!!!

నేనతని కేమీ సాయం చెయ్యలేదు.

భగవంతుడి సాక్షిగా చెప్తున్నాను.

ఏ సాయమూ చెయ్యలేదు.

కాని ఎవరు నమ్ముతారు??!!

చెయ్యకూడని పని డబ్బుపుచ్చుకొని చేసేవంటారు.

'చెయ్యలేదు బాబూ,' అంటే అపనమ్మకంతో నవ్వుతారు.

హెడ్ క్లార్కు అన్నమాటలకి మరొకడైతే కత్తితో పొడుచుకు చచ్చిపోయుండును.

సిగ్గూ లజ్జా లేని వెధవని కాబట్టి ఇలా బతికున్నాను.

ఇంతటితో అయిపోయిందా?

ఇంకా ఏముందో ముందుకి!!

నాకు భయంగా ఉంది.

మరేం ఫర్వాలేదని అవధానన్నాడు.

కాని నాకు భయంగా ఉంది.

అవధానికి అన్ని భోగటాలూ తెలుస్తాయి.

అవధానికి అన్నీ తెలుసు.

అవును. అవధాని అనుభవం ఉన్నవాడు.

అలాంటి అవధాని ఆసరా ఇచ్చేడే!

మరేం ఫర్వాలేదని!

అందుచేత ఆఫీసులో మరే[illegible] ఉండదనుకుంటాను.

కాని, ఈ గవరయ్య!

గవరయ్యా నేం చెయ్యాడం?

అయిదువందలు ఎక్కణ్ణించి తెచ్చేది? వెంకట్రావు ఇవ్వనట్టే. నిరాశ చేసుకోవలసిందే! మరయితే ఎలాగ?

అయిదువందలూ నే నివ్వకపోతే?......

గవరయ్యా చంపేస్తాడు.

పీకమీద కాలు వేసి తొక్కేస్తాడు.

నల్లిని నలిపినట్టు నలిపేస్తాడు.

వెంకట్రావు సాయిమ్మిస్తే బావుండును.

నాలుగురోజులు పోతే ఇస్తానన్నాడు.

కాని, ఇవ్వడు!

ఇచ్చినా గవరయ్యా ఆగుతాడో ఆగడో!

తల్చుకొందికి భయంగా ఉంది.

గవరయ్యా బాధ ఎలా వదుల్చుకోడం?

ఏందారి దేవుడా! రక్షింపవా భగవంతుడా!

ఈ విపత్తు తప్పిపోతే,

దేవదేవా, జగన్నాథా

పూరీవస్తాను. నీకోసం.

రక్షించు. రక్షించు.

సుబ్బయ్యాకి కొంత ధైర్యం వచ్చింది.

జగన్నాథస్వామి తప్పక రక్షిస్తాడు.

నాన్న అంటూ ఉండేవాడు కదా!

పూరీ జగన్నాథస్వామి కోరినవన్నీ ఇస్తాడని.

నాన్న చాలాసార్లు పూరీ వెళ్లివచ్చేడు.

ఏముంది? నేకూడా ఇట్టేవెళ్ళి అట్టేరావచ్చు.

జగన్నాథా! రక్షింపవా?

ఒకసారే కాదు. మరోసారికూడా వస్తాను.

నేను. కమల, క్రిష్ణుడు.

ముగ్గురంకూడా తల లిచ్చేస్తాం!

సావిత్రికూడా వేణి ఇచ్చేస్తే బావుండును. కాని ఇవ్వదు.

“నీ వేణి ఇస్తేనే నీ భర్త ఆపద తప్పతుంది” అని సాక్షాత్తు జగన్నాథస్వామి వచ్చి చెప్పినా ఇవ్వదు.

కాని, భగవంతుడా! నేనూ నా పిల్లలూ వస్తాం.

ఎలాగైనా కాపాడు, నన్ను కాపాడు.

మెల్లిగా నడుస్తున్నాడు సుబ్బయ్యా.

అతనికి ఇంటికి వెళ్లాలని లేదు.

గోడలమధ్య గదుల్లో వంటరిగా కూర్చోవాలి.

ఇంకా గాభరాగా ఉంటుంది.

“ఏమలా ఉన్నారు?” అని అడగనైనా అడగదు సావిత్రి.

నేను బతికున్నా ఒకటే చచ్చినా ఒకటే దానికి.

ఈపాటికి కమలా క్రిష్ణుడూ పడుకొక్కనుంటారు,

నిశ్చింతగా, హాయిగా.

నే నిన్ని కష్టాల్లో ఉన్నానని తెలీదు వాళ్లకి.

తెలుస్తే, పాపం, కమల బెంగ పెట్టుకొంటుంది.

ఒట్టి సత్తెగాలం పిల్ల.

రాత్రల్లా ఏడుస్తూ కూర్చుంటుంది.

అ దేడుస్తే నా కష్టంగా ఉంటుంది.

సుబ్బయ్యా కళ్లు చెమ్మగిల్లేయి.

కారిన కన్నీరు తుడుచుకున్నాడు.

ఆడదానికన్నా అధ్వానం నేను.

‘ఏం సుబ్బయ్యా, ఎందుకలా ఏడుస్తున్నావు?’

అని ఎవరైనా అడుగుతే ఏం చెప్పేది!

“సుబ్బయ్యా ఆడదాన్లా ఏడుస్తున్నాడు” అని అంతా ఎగతాళీచేసి వెక్కిరింపుగా నవ్వుతారు.

కనికరం లేకుండా నవ్వుతారు.

లేదు. ముమ్మాటికీ లేదీ లోకంలో కనికరం.

అంతా అతి నిర్దాక్షిణ్యంగా ఉంటారు.

ఛా! ఛా! వెధవలోకం! వెధవ మనుష్యులు!

ప్రళయం వచ్చి అంతా అంతమైతే బావుంటుంది.

మనిషన్న ప్రతివాడూ నాశనం కావాలి.

అందరికన్నా ముందు గవరయ్యా చావాలి.

మిగతా అంతా ఉన్నా ఫరవా లేదు.

గవరయ్యా చచ్చిపోవాలి.

హబ్బా!!

ఈరాత్రే గవరయ్యా చచ్చిపోతే ఎంతహాయిగా ఉంటుంది!!!

గవరయ్యా ప్రాణాలు పోవాలి. ఎలా పోతుంది ప్రాణం?

ఏముంది? క్షణంలో పోవచ్చు.

ఎంతమంది చచ్చిపోలేదు, అకస్మాత్తుగా.

తెగ తాగే మనుష్యులకి గుండె ఆగిపోతుందంటారు.

గవరయ్యా మస్తుగా తాగుతాడు.

ఏం? ఈ రాత్రి గుండె ఆగిపోయి చచ్చిపోకూడదూ!

చీకట్లో పాము కరవకూడదా!
ఇల్లు కూలి మీదపడకూడదా!
ఏ చెట్టుకో కారుగుద్దేసి తలబద్దలవకూడదా!
డబ్బుకోసం దొంగలు చంపకూడదా!
వెధవ ప్రాణం ఎంతసేపట్లో పోవాలి.

గవరయ్య ప్రాణం అన్నిటికంటే గొప్పది కాదు కదా!

గవరయ్య ప్రాణం పోయే సాధనాలగురించి ఆలోచించడంలో గవరయ్య ఎందుకు చచ్చిపోవాలని కోరుతున్నాడో ఏమర్చేడు సుబ్బయ్య.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

చల్ల గాలికి మెల్ల మెల్లగా తెల్ల తెల్లటి మేఘాలు

ఆకాశంలో అక్కడక్కడ తేలూ పోతున్నాయి. చేతికందని చిరుమబ్బులవైపు చల్లటి చంద్రుడు తెల్లబోయి చూస్తున్నాడు. దూరంగా కనపడుతూన్న తోటలో కొబ్బరిచెట్లు బరువుగా తలలాడిస్తున్నాయి. నీలివెన్నెల్లో ఊరంతా నీలంగా అగుపిస్తోంది.

సుబ్బయ్య వంతెనమీదికి వచ్చేడు.

"ప్రకృతి ఎంత రమణీయంగా ఉంది!"

అని సుబ్బయ్య సాధారణంగా అనుకోడు.

కాని, ఆరాత్రి అక్కడికి వచ్చేక "ఆహా! ఇక్కడ ఎంత బావుంది!'' అని ఆశ్చర్యపోయేడు.

వంతెనదగ్గర చల్లగా ఉంది. హాయిగా ఉంది. ప్రశాంతంగా ఉంది. సిమెంటు గట్లమీద దూర దూరంగా అక్కడక్కడ ఎవరో కూర్చున్నారు. అటూ ఇటూ తూగుతూ రెండెడ్లబండీ ఒకటి పోతోంది. సిమెంటు రోడ్డు పాలరాతి గచ్చులా కనిపిస్తోంది. దిగువని ఇసుక తిన్నెలు వెండి కుప్పల్లా మెరుస్తున్నాయి. పారుతోన్న పిల్లకాలువ కొన్ని చోట్ల తళతళలాడుతోంది. ఉత్తరాన్నుండే నీలి పర్వతం ప్రాచీనకాలపు మృగంలా అలిసిపోయి పడుక్కుంది.

చల్లగా మెల్లగా ఆగి ఆగి పిల్లగాలి వీస్తోంది.

"ఇక్కడ హాయిగా ఉంది" అనుకొని వంతెన గట్టుమీద కూర్చున్నాడు సుబ్బయ్య, సిగరెట్టు తీసి ముట్టించేడు. నీలంగా మేఘంలా లేచిన పొగ వెన్నెల్లో కరిగిపోయింది.

ఇంటికి వెళ్లను. ఇలా ఇక్కడే కూర్చుంటాను.
స్వేచ్ఛగా ఉన్నా దిక్కడ.

రెండెడ్ల బండీ వంతెన దాటిపోయింది. ఆ వైపునుంచి పాటపాడుతూ ఎవరో సైకిలుమీద వస్తున్నారు. పాట దగ్గరపడి దూరమైపోయింది. ఇంకో వైపునుంచి రైలుకూత వినవచ్చింది.

"పడమటి బండీ కాబోలు వస్తోంది"

తూర్పునుంచి పడమటకీ, పడమటనుంచి తూర్పుకీ ఎవరెవరో ప్రయాణం చేస్తూనే ఉంటారు.

ఈ వూళ్ళో దిగుతారు. మరోచోట దిగుతారు. ఈ వూర్లో ఎక్కుతారు. ఇంకోచోట దిగుతారు.

ఎంద రెందరో ఎన్నెన్ని చోట్లకో ప్రతిదినం ప్రతినిమిషం ప్రయాణం చేస్తూనే ఉంటారు.

ఎక్కడికీ వెళ్ళనివాణ్ణి నేనొక్కణ్ణే.

నేనుకూడా ఎక్కడికో అక్కడికి ఎందుకు పోకూడదు?

ఈమట్టుకి ఇలా ప్రయాణం అయిపోతే—

ఏక్ నిరంజన్‌గా ఎక్కడికో పోతే—

సుబ్బయ్య కనిపించడంలేదు తెలుసా? నిన్న రాత్రి వంతెనగట్టుమీద కూర్చున్నాట్ట. మరి పికర్లేదు, సూయీసైడ్ కేసో ఏమిటో! అవునవును, అంతే అయుండాలి.

ఎందుకు ఇలాటి పనిచేసేడు సుబ్బయ్య? పాపం రోజూ ఆవార కూర్చొనేవాడు, పాపం! హెడ్ క్లార్కు ఎంతో ఇన్‌సల్టింగా మాట్లాడేడు. తనేమిటో తన పనేమిటో. మాట్లాడిస్తేగాని మాట్లాడేవాడా! ఎంతో అమాయకుడు! ఈ రామస్వామిగాడే నొప్పించేడు! గవరయ్య ఏదో 'త్రెటెన్' చేశాట్ట? నిజమే నంటావా?

మధ్యాహ్నం అంతా 'కేన్టీన్' లో కూర్చొని కాఫీతాగుతూ మాట్లాడుకుంటారు.

సరిగా పన్నెండు గంటలకి వస్తాడు గవరయ్య.

సుబ్బయ్య సీటు ఖాళీ!!

"ఏమయ్యేడు సుబ్బయ్య?"

ఇంకా మీకు తెలీదూ? నిన్న రాత్రినించీ కనిపించలేదు. ఏమిటో? కాలవలో 'బాడీ' కోసం వెతుకుతున్నారు!

ఇంకేవణ్ణడుగుతాడు అయిదువందలు?
నా ఉసురంతా తగుల్తుంది.
నిజంగా ఎక్కడికైనా పోవాలనివుంది నాకు.
ఎక్కడికి పోవడం? ఎలా పోవడం?
పోతే నా పెళ్లాం పిల్లల గతేమవుతుంది?!
పాపం, కమల ఏడుస్తుందే!

బెంగపెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తుందే!!

వెక్కి వెక్కి ఏడ్చేడ్చి బెంగపెట్టుకొని చచ్చిపోతుందో ఏమిటో!

అబ్బే! లాభం లేదు.

ఇలా నే నీవూళ్ళో ఉండవలసిందే!

ఏదొచ్చినా సరే అనుభవించవలసిందే!

కంటికి కనిపించని తాళ్ళతో కాళ్ళూ చేతులూ కట్టేసినట్లయింది సుబ్బయ్యకి.

నిస్పృహతో అలానే కూర్చున్నాడు.

వంతెనమీద చాలామంది మనుష్యులు నడుస్తున్నారు.

ఇంతమంది ఎక్కణ్ణించి వస్తున్నారు?

"వరలక్ష్మి పాటలు బాగున్నాయిరా"

"అంజలీదేవి యాక్షనుమాత్రం"

ఓహో! సినీమానుంచి వస్తున్నారు.

ఊళ్ళో అంతా సినీమాలకి వెళ్తున్నారు.

నేనొక్కణ్ణే సినిమా చూడనివాణ్ణి.

చూసే దేముంది? నా బతుకే ఓ సినీమాలాగుంది.

చూడండి చూడండి "సుబ్బయ్య జీవితం"

ఆంధ్రప్రజానీకానికి అందజేసే చిత్రరాజం.

ఆంధ్ర చిత్రజగత్తులో, ఆంధ్ర 'సినీ' 'ఫీల్డు'లో విషాదగాథలు లేవుకదా అని విషాదంలో మునిగిపోయిన ఆంధ్రులకు సమర్పించే మా కానుక.

"సుబ్బయ్య జీవితం"

ఇదియొక విషాదగాథ. మహత్తర సన్నివేశాలతో కూడుకొన్న రసమయ చిత్రం.

వేనకువేల ప్రజలు చిత్రాన్ని చూచి ఏడ్చియేడ్చి ఇంటికిపోయి మూర్ఛపోయేరు.

వీళ్లంతా ఇంటికి పోతున్నారు.

'సుబ్బయ్య జీవితం' వీళ్లు చూడలేదు కాబట్టి ఇళ్ళకిపోయి మూర్ఛపోరు.

హాయిగా నిద్రపోతారు. కలలన్గనియెదరు.

నేనుకూడా ఇంటికిపోతే బావుంటుందేమో.

గట్టు దిగుదామా, గట్టుమీద కూర్చొనే ఉందామా అని తర్కిస్తున్నాడు సుబ్బయ్య.

"ఏమండీ సుబ్బయ్యగారూ ఇక్కడ కూర్చున్నారేం?"

అన్నాదావిడే ఎదురుగా నిల్చొని నవ్వుతూ.

రావడం చూడలేదు. ఆగడం చూడలేదు.

ఎవరీవిడ?

ఎవరా? 'ఎవరీవిడ' అని చూస్తూ ముంగిలా మాట్లాడకుండా చూస్తూ కూర్చుంటావా? మొద్దా!

ఈవిడ ఆవిడే!

ఆవిడే ఈవిడ!

నల్లచీరావిడ!

నల్లచీరావిడ నల్లచీరే కట్టుకొంది.

నీలివెన్నెల్లో నల్లటి నలుపుచీరవెనక ఆవిడ తెల్లగా మెరుస్తోంది.

నల్లటిచీరవెనక తెల్లటి జాకెట్టు పాలనురుగులా పొంగుతోంది.

తెల్లటి వెన్నెల్లో ఆవిడ నల్లటి కళ్ళతో చూస్తోంది.

మిలమిల మెరుస్తోన్న నల్లటి కళ్ళతో చూస్తూ తెల్లటిపళ్ళు కనపడేలా నవ్వుతోంది.

ఈవిడ మనుజకాంత కాదు.

ఈవిడ దేవతామూర్తి.

సుబ్బయ్యలో సంతోషం ఉప్పొంగి గట్లు తెంచుకొంది.

"ఏమండీ సుబ్బయ్యగారూ! ఇక్కడ కూర్చున్నారేం?"

ఎందుకూర్చున్నాను? ఎవరికోసం కూర్చున్నాను?

ఎందుకోసం? ఎవరికోసం?

నీకోసం! నీకోసం!

నీకొరకై ఎదురుచూస్తూ కూర్చున్నాను.

గాలిచేత ఎవరో కబురు పంపించేరు.

"అక్కడ కూర్చో! ఆవిడ వస్తుంది!"

వస్తావని ఎవరో వార్త తీసుకు వచ్చేరు.

అందుచేత నీగురించి నిరీక్షిస్తూ ఇక్కడ ఆసీనుడనైయున్నాను దేవీ!

"మీరు కన్పిస్తారుకదా అని మీకోసం కూర్చున్నానండి"

"ఏంగట్టివారండీ" అన్నాదావిడ నవ్వుతూ.

నవ్వుతూ అని, అన్నాక నవ్వింది.

కిలకిల కలకల జలజల జిలజిల నవ్వింది.

ఆ నవ్వుకి వెన్నెల సిగ్గుపడింది.

స్వర్గంలో దేవేంద్రసింహాసనంమీద కూర్చున్నవాడు సుబ్బయ్య.

ఆమెకూడా ఆ సింహాసనం ఎక్కింది.

వంతెనగట్టుమీద ఆవిడకూడా కూర్చొంది.

ఆవిడ దూరంగా కూర్చోలేదు.

సుబ్బయ్య ఎడంగా జరగలేదు.

"నే నిలావస్తానని కలగానేరా?"

"ఆఁ"

"అయితే నాక్కూడా కలొచ్చింది"

"ఏఁవిఁటది?"

"మీరిలా అబద్ధాలాడతారని"

అసందర్భంగా ఉన్నట్టిన్నీ, అర్థం లేనట్టిన్నీ, నవ్వదగనిదిన్నీ, అయిన ఆమాటకి ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఇంతరాత్రి అయాక మీ రెక్కణ్ణించి వస్తున్నారు?"

"సినీమా ఇప్పుడే విడిచేరు కాబట్టి ఇంతరాత్రయేక నేను వస్తున్నాను. కాని మీరు ఇంత రాత్రి వేళ ఇంటికి వెళ్ళకుండా వంతెనగట్టుమీద కాసేరేం?"

"చెప్పేనుకదూ! మీకోసమే కాసుకూర్చున్నానని!"

నే నేనా? నే నే మాట్లాడుతున్నానా?

అతి స్వల్పంగా పరిచయం గల ఆడమనిషితో ఇలా పరిహాసాలాడుతున్నది నే నేనా?

"పోనిస్తురూ! సుబ్బయ్యగారూ! ... హాస్యానికేంగాని...అలా..."

"నా పేరు సుబ్బయ్యని ఎలా తెలిసింది మీకు?"

"ఎలా తెలిసిందో చెప్పుకోండి చూద్దాం"

"ఏమో!"

"చెప్పుకోలేరా?"

"ఊహుఁ"

"ఆమాత్రం చెప్పలేరా! మీ అమ్మాయి కమల నా స్టూడెంటుగదండీ"

ఈ నిర్భాగ్యుడి పేరు తెలుసుకోవాలనే కుతూహలం ఈవిడకి ఎందుకు కలిగిందో! ఆశ్చర్యం!!

"అయితే మా అమ్మాయినడిగేరా నాగురించి?"

ఆవిడ సిగ్గుపడ్డాది.

"ఎందు కడిగేరు?"

ఆవిడ ఇంకా సిగ్గుపడ్డాది.

ఆవిడ అలా సిగ్గుపడ్డందుకు సుబ్బయ్యకి సంతోషం ఆశ్చర్యం కలిగి ఒక్కసారిగా ఆవిడయందు ఆదరణ, అభిమానం, అనురాగం, ప్రేమ, వాంఛ వగైరా వగైరాలన్నీ కలిగేయి.

"కానయితే, మీ పేరు చెప్పేరు కాదేం నాతో?"

అందుకు జవాబుగా "తెలుసులెండి మీసంగతి తెలుసు" అన్నాదావిడ తలా కళ్ళూ పోగ్గా తిప్పుతూ.

"ఏమిటి తెలుసు?..."

"నా పేరు మనోరమని మీరు తెలుసుకొనీ తెలియనట్టుగా నటిస్తున్నారనీ..."

"అయితే మీ పేరు మనోరమా?"

మొగవాళ్ళని ఆకర్షించడానికి స్త్రీలకి భగవంతుడు ప్రసాదించిన నేర్పంతా ప్రదర్శించిందావిడ తలఊపడంలో.

కొంచెం సిగ్గు అభినయిస్తూ, తల ఆడిస్తూనే కిందికి దించింది. కాస్త పెదవులు కదల్చి నవ్వింది. ఒక్కరవ పెంకెతనంగా వాలుచూపు వారచూపు చూసింది. జారని పైట సర్దుకొంది.

"ఏం? నిజంగా ఇంతవరకూ నా పేరెరగరా మీరు?"

నా పేరు కమల నడిగి తెలుసుకున్నాది. అలాగే ఆమె పేరు నే తెలుసుకున్నానని అనుకొంటోంది.

"ఎరక్కేమి!"

అయితే మరి మళ్లీ నన్నెందుకూ అడిగేరు?"

"మీ నోటంట వింటే మధురంగా ఉంటుందని"

ఈరీతిగా, ఇంతసులభంగా నేను — సుబ్బయ్యని — నే నేనా మాట్లాడుతున్నాను??!!!

"అబ్బ! ఎంత గట్టివారండీ!"

అని తిప్పుకొంటూ తియ్యగా అన్నాదావిడ.

నేనా గట్టివాణ్ణి?? నేను గట్టివాడినా??

సుబ్బయ్యకి నవ్వొచ్చింది.

సుబ్బయ్య గట్టివాడంటే అనేకులు నవ్వుతారు. వేళాకోళంగా నవ్వుతారు.

సావిత్రి, వెంకట్రావు, అవధాని, రామస్వామి, ఎదటింటి మాస్టరు, పక్కింటి సూపర్ వైజరు అంతా నవ్వుతారు.

—మర్చిపోయేను—గవరయ్య నవ్వుతాడు.

గవరయ్య! గవరయ్య!

గవరయ్యతో ఉన్న తగాయిదా అంతా నెత్తిమీద పెట్టుకొని ఈవిడతో ఇలా ఎలా మాట్లాడగల్గుతున్నాను?

ఆశ్చర్యం! ఆశ్చర్యం!

"......అలా దీనంగా కూర్చున్నారేమండీ?"

"ఎవరు?"

"మీరు"

"ఏమిటన్నారు?"

"అబ్బ! నామాట వింటేనా మీరు? ఇందాట్లానే వచ్చినప్పటికి ఎందు కలా దీనంగా ఉన్నారు? అలా అంత దీనంగా కూర్చోడం చూసి జాలేసింది స్మండీ నాకు"

జాలి! జాలి! జాలి!

ఈ విశాల విశ్వంలో సుబ్బయ్యని చూసి జాలి పడేవ్యక్తి సుబ్బయ్యే,

ఇంతవరకూ!

కాని, ఇప్పుడు—

ఈవిడకి నన్ను చూసి జాలి కలిగిందట!!

జాలి!!!

ఎంత చక్కటిమాట! ఎంత తియ్యటిమాట!

ఎంత చక్కటి తియ్యటి మనిషి ఎంత చక్కగా తియ్యగా అన్నా దామాట!!

ఎంత నిర్భాగ్యుడిగురించి అన్నా దామాట!!

ఆవిడ అలా అనగానే సుబ్బయ్యకి తన దురవస్థలన్నీ తలపుకివచ్చి ఒక్కసారిగా దుఃఖం కమ్ముకొచ్చింది.

దుఃఖం కమ్ముకు రావడంతో నోటమాట పోయింది. కంటనీరు నిండింది.

నీరునిండిన నయనాల్లోకి ఆమె వినీలనయనాలు జాలితో చూసేయి.

అతనికి దూరంగాలేని ఆవిడ అతనికి దగ్గరగా జరిగింది. అతని చెయ్యి చేతులోకి లాక్కుంది.

"అయ్యయ్యో! ఏమండీ సుబ్బయ్యగారూ, అలా వున్నారు?? వంట్లో బాగులేదా? ఏమొచ్చిందీ? మాట్లాడరేం??"

ఆమెని ఒక్కసారిగా కౌగలించుకొని, తన హృదయానికి హత్తుకొని, లోకంలో అందరి హృదయాలూ కరిగేలా ఏడవాలనిపించిం దతనికి.

అలా చెయ్యలేక ఆమె చేతిలోంచి చెయ్యి తీసుకొని కళ్ళు తుడుచుకున్నాడు. తన చేతిని ఆమె పట్టుకున్నందుకు ఆశ్చర్యపడ్డం మర్చిపోయేడు.

"నా సంగతంతా చెప్తే తెల్లారిపోతుందండీ. అదంతా ఓ పెద్దగాథ"

అతనికి ఇంకా దగ్గరగా వచ్చి అతనిభుజం చేత్తో ఊపుతూ అడిగిందావిడ :

"అయ్యో! అదంతా ఏమిటో నాతో చెప్పరా?"

నాతో కూడా చెప్పరా అనేభావంతో అడిగిరదామె, అందరికంటే సుబ్బయ్యకి తనే దగ్గర మనిషయినట్టు.

బాధలోనే సుఖంగా ఉంది అతనికి, ఆమె అలా దగ్గరకి వచ్చి భుజంమీద చెయ్యి వెయ్యడంతో.

పరిచయం చాలా తక్కువ గల పరాయి ఆడమనిషి రాత్రిసమయంలో రోడ్డుపక్క వంతెనగట్టుమీద వెన్నెల్లో కూర్చొని వెచ్చగా దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యివేసి మాట్లాడ్డం అసందర్భంగాగాని, అసహజంగాగాని ఉన్నట్టు సుబ్బయ్యకి తోచలేదు.

సహజంగానూ, సమయోచితంగానూ ఉన్నట్టే తోచింది.

"చెప్పండీ" అన్నాది మనోరమ.

ఎవడు చెప్పకుండా ఉండగలడు?

ఉండబట్ట లేక ఉన్నదంతా చెప్పేడు సుబ్బయ్య.

అంతకు క్రితం సుబ్బయ్యని రెండుసార్లే చూసి, అతనితో ఒక్కసారే మాట్లాడిన మనోరమ అతని జీవితంలో తెలుసుకోవలసినదంతా తెలుసుకొంది ఆరాత్రి.

"మిమ్మల్ని చూస్తే నాకు నిజంగా జాలి వేస్తోందండీ"

ఆమె కళ్ళంట నీరు జారినట్టనిపించింది

కాని అతను గమనించినట్టులేదు.

ఆమెతో అంతా చెప్పడంతో అతనికి దుఃఖోపశమనం అయింది. గొప్ప 'రిలీఫ్' కలిగింది.

అంతా చెప్పి అతను ప్రశాంతంగా కూర్చున్నాడు.

అర్ధరాత్రి అయింది. వంతెనమీద అక్కడా అక్కడా కూర్చొన్న కొద్దిమందీ ఎక్కడకో ఎక్కడకో పోయేరు. మంచు కొంచెం పడ్డంచేత అంతటా చల్లగా ఉంది.

పద్దెనిమిదేళ్ళకుర్రవాడొకడు ఒకవైపునుంచి వస్తూ, సుబ్బయ్యా మనోరమలవైపు చూస్తూ చూస్తూ వచ్చి పక్కకితిరిగిచూసి, వెనక్కి తిరిగితిరిగి చూస్తూ చూస్తూ వెళ్ళేడు.

ఈర్ష్యతో, క్యూరియాసిటితో చూస్తున్నాడు. చూసుకొంటూ పోయేడు.

నన్ను చూసి ఈర్ష్యపడుతున్నాడు.

అని అనుకోవడంతో సుబ్బయ్యకి ఎంతో ఉత్సాహం కలిగింది.

తీరని కోరికల్తో బాధపడుతూ వెళ్లుంటాడు.

ఆడామొగా ఇలా కూర్చున్నప్పుడు నేనూ అలాగే చూసేవాణ్ని.

నేనూ ఇలా కూర్చోగలుగుతానని ఎన్నడైనా అనుకున్నానా?

కాని—

అర్ధరాత్రివరకూ ఈమెతో ఇలా కూర్చోడం బావుంటుందా?

హాయిగా ఉంది.

కాని, బావుంటుందా, అర్ధరాత్రివేళ!

“అర్ధరాత్రి అవుతూందండీ”

“అయ్యో! మీకు ఆలస్యం అయిందో ఏమిటో! ఇంతవరకూ కూర్చోపెట్టేశాను”

హద్దీ! అలా వుండాలి ఆడమనిషి మాట చమక్!

నా వెధవగొడవలన్నీ వెళ్ళబోసుకొని, అనవసరంగా ప్రయాసపెట్టి, ఈమెని అర్ధరాత్రివరకు నే నాపేస్తే “కాదు! నావల్ల ఆలస్యం అయింది” అంటున్నాదీమె!

పాపం ఈవిడకి చాలా ఓపిక.

ఈవిడ చాలా మంచిమనిషి, పాపం.

ఈవిడది చాలా జాలిగుండె.

ఈవిడ పరులకష్టాల్ని చూసి సహించలేని మనిషి.

ఈవిడ సద్గుణాలరాశి.

ఈవిడ అందాలరాణి.

ఈవిడ నా పెన్నిధి.

ఈవిడ నా అదృష్టం.

హబ్బబ్బా! హయ్యారే! ఆహాహా! ఓహోహో!

ఎంత హాయిగా ఉంది!

ఎంత విచిత్రంగా ఉంది!

ఇదంతా జరుగుతోందా? ఆహా! జరుగుతోంది.

అయితే ఇదంతా ఎలా జరుగుతోంది??!!

దేవా! జగన్నాథా!

దేవీ! మనోరమా!

“మనోరమా, మనోరమా”

సుబ్బయ్యేనా ఇలా పిల్చినది? ఎంత ఆశ్చర్యం!

మెల్లగా మెల్లగా, బరువుగా బరువుగా, వెచ్చగా వెచ్చగా ఆమె తల వాలింది అతని భుజం మీద.

వణుకుతూ వవణుకుతూ అతని చేతులు చేరేయి ఆమెచుట్టూ.

కళ్ళు మూసుకుకూర్చున్నారు, అలానే. కళ్లు తెరిచి గట్టు దిగేరు అలానే. గట్టుదిగి నడుస్తున్నారు అలానే.

ఓయీ, సుబ్బయ్యా! నీవు జాగ్రదవస్థలోనే ఉంటివా?

ఉన్నాను. లేను.

ఇదియంతయు స్వప్నమా? సత్యమా?

స్వప్నం కాదు. సత్యం కాదు.

కానిచో ఇంకెయ్యది?

సత్యమైన స్వప్నం. యథార్థమైన స్వప్నం. కలకాని కల. నిజమైన కల. కలగాని నిజం. నిజంగాని కలగాని కల. ఆగు! ఆగు! కల నిజమయినదా? లేక నిజమే కలగా మార్పు చెందినదా?

అబ్బబ్బ! ఈ చొప్పదంటు ప్రశ్నలు ఇప్పుడెందుకు?

క్షమించు. క్షమించు.

చెట్టపట్టాలు వేసుకొని సుఖంగా మమ్మల్ని ఇంటికిపోనియ్!

పొండు పొండు సుఖముగ నుండుడు.

దగ్గరగా నడుస్తూ మాట్లాడుకోనియ్!

సరేసరే.

చిలకపలుకులు చెప్పుకోనీ!

సరే సరే.

కష్టసుఖాలు ఒకరినొకరు తెలుసుకోనీ!

సరే సరే.

వెన్నెల్లో వెచ్చగా నడవనీ!

సరే సరే.

ఈ స్త్రీరత్నాన్ని అదిమిపట్టనీ!

సరే సరే, సరే సరే.

“మీ ఇల్లెక్కడ?”

ఆమె చెప్పింది.

“రండి అక్కడవరకూ కూడావస్తా”

“ఇంతవరకూ వచ్చేరుగద! ఇంకా ఎందుకు మీకు శ్రమ?”

“మీతో వస్తే నాకే శ్రమా ఉండదు”

“నామీద అభిమానంకొద్దీ అలా అంటున్నారు”

"నన్ను రావద్దంటున్నారు. నామీద మీకు... ఆ అభిమానం లేదా?"

"లేదు కాబట్టే మీతో ఇలా వస్తున్నాను"

చేతులకింద నడుంమీద ఆనందపారవశ్యంలో గట్టిగా నొక్కాయి అతని చేతులు.

నాలుగురోడ్ల జంక్షన్‌వద్దకి వచ్చేరు. మర్రిచెట్టు వెలుగునీడల్లో నిల్చున్నారు. జనం సంచారంలేని రోడ్డుమీద చంద్రుణ్ణి అడ్డుతూంటే మర్రిచెట్టునీడలో నిల్చున్నారు, ఎదురెదురుగా.

"అదేనండీ, నేనుండే ఇల్లు"

"అయితే వెళ్తారా!"

జవాబు చెప్పకుండా దగ్గరగా వచ్చింది. దగ్గరగా వచ్చిన అందమైన ఆడమనిషిచుట్టూ చేతులు వెయ్యక తప్పదు.

ఆకులనీడల్లో చీర నలుపు కలిసింది. వెలుగు జాడల్లో కళ్లు మెరిసేయి. మధురమైన వాసన వేసింది. మత్తుగా ఉంది.

ఎన్నడూ అడదాన్ని ఎరగనివాళ్ళాగ ఆమెని కౌగలించుకున్నాడు బలంగా గాఢంగా.

ఆమె పెదవులు ఉన్నాయి వెచ్చగా, తడిగా, తియ్యగా.

వీపు ఆమెది ఉన్నాది గట్టిగా మెత్తగా.

ఉన్నాదా మెజాకెట్టు పాలనురుగుపొంగు మెత్తగామెత్తగా.

మనోరమ ఉన్నది ఆమె అతిమధురంగా.

"నామాట విని ఇప్పుడు ఇంటికి రాకండి. అద్దెలవాళ్ళంతా లేస్తారు. అర్ధరాత్రి..."

గిర్ గిర్ గిర్ గిర్.

"రేపు సాయంకాలం రండి. ఏం?"

ఏమిటేమిటి?

"రేపు సాయంత్రం వస్తారుగా"

"తప్పకుండా"

వెనకవైపు నడుంమీదా మెడమీద చేతులు వేసి అతణ్ణి దగ్గరగా లాగి గట్టిగా అదుముకొంది.

ఆమె జుత్తు అతనికళ్ళల్లో పడుతోంది.

ఆమె కుడిబుగ్గ అతని చెంపని అనింది.

ఆమె గుండెలు అతనికి ఆనుకున్నాయి.

ఆమె వూపిరి అతని వూపిరితో వేడిగా కలిసింది.

"ఇంక నన్ను వెళ్ళనివ్వండి! మళ్ళీ రేపేగా కలుసుకుంటాం! ఏమంటారు?"

"సరే"

ఆవిడ వెళ్లింది.

సుబ్బయ్య నీరసంగా నిల్చున్నాడు. అతనికి మతి చెడినట్టుగాఉంది. నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు.

"మనోరమా! మమనోరరమా!"

మనోరమ ఇంట్లోకి వెళిపోయింది.

"ఈవిడ ఆరితేరినమనిషి"

అనుకోలేదు సుబ్బయ్య.

9

మర్నాడు ఉదయం.

ఏడుగంట లయింది.

సుబ్బయ్య తల దిమ్మెక్కి బరువుగా ఉంది.

సావిత్రి వంటగదిలో ఉన్నాది. కమలాం క్రిష్ణుడూ బడికి వెళ్ళడానికి అప్పుడే తయారవుతున్నారు.

వంటగదిలోంచి గిన్నెల చప్పుడూ, వీధిలోంచి వాహనాలు చేసే చప్పుడు వినవస్తున్నాయి.

గోడమీద గడియారం దీనంగా చూస్తోంది.

గదిలో మేజామీద మాసిన గుడ్డమీద పెట్టిన గ్లాసుమీద మూతిగా పెట్టిన పాతపుస్తకపు అంచులు దీనంగా వేళ్లాడు తున్నాయి.

మూడుకోళ్లు ఒకరీతిగా ఉన్న నాలుక్కోళ్ళ మంచంమీద చిరిగిన పరుపుమీద చిరగని దుప్పటి మీద చిరిగిన బనియను, చిరగని షెరాయీ వేసుకున్న సుబ్బయ్య దీనంగా కూర్చున్నాడు.

సుబ్బయ్య సంతోషంగా లేడు.

రాత్రి జరిగినదంతా అతని మనసుని కలచి వేస్తోంది.

రాత్రి పొందిన సుఖం రాత్రితోనే పోయింది.

ఈ మనోరమ ఎవరు?

తల్చుకుంటే నాకు భయంగా ఉంది.

ఎటువంటి మనిషో, ఏమిటో!

నాగురించి అంతా ఆమెకి చెప్పేశాను.

ఆమెగురించి నాకు తెలిసినదేమిటి?

ఆమెది ఏలూరు. ఆమె ఇక్కడ స్కూల్లో టీచరు.

అంతే తెలుసు నాకు.

అంతే తెలుస్తేనేం? ఇంకా ఏం తెలియాలి నీకు?

నిన్న రాత్రిలాంటి అనుభవం నీ జీవితంలో ఎన్నడైనా ఎరుగుదువా నువ్వు??

నిన్న రాత్రి, నిన్న నిన్న, నిన్న రాత్రి నిన్ను స్వర్గంలోకి, వైకుంఠంలోకి, కైలాసంలోకి ఇంకా ఇత్యాదుల్లోకి తీసుకుపోయింది కదా ఆవిడ!!!

అందు కామెకి యావజ్జీవం కృతజ్ఞుడివిగా ఉండక ఆమె తలపుకి వచ్చేసరికి బెదురుతూ భయపడుతూ—

"ఆవిడ మళ్ళీ కనిపించకపోతే బావుండును"

అనుకొంటున్నావా?

నీకు విశ్వాసం లేనే లేదు. నీకు సిగ్గూ లేదా?

ఉంది. నాకు భయంగా ఉంది నాకు పెళ్లాం పిల్లలూ ఉన్నారు.

నా ఇంటికివచ్చి నా పీకలమీద ఆవిడ కూర్చుంటేనే నేం చేసేది?

నువ్వు పిరికిపందవి. కృతఘ్నుడివి.

ఏదో ఉద్యోగం చేస్తూ నలుగుర్లోనూ గౌరవంగా మర్యాదాగా కాలక్షేపం చేస్తూంటే ఈవిడ నన్ను నలుగుర్లోనూ......

నీ గౌరవ మర్యాదలు ఏడ్చినట్టే ఉన్నాయి. ఈరోజు గవరయ్యవచ్చి గుమ్మంలో నిల్చొని, నిన్ను టకాయించి, బూతులుతిట్టి కేకలు వేసినప్పుడు అందరికీ తెలుస్తుంది నీ గౌరవం, నీ మర్యాదా.

అమ్మయ్యో! గవరయ్య సంగతే మర్చేను!

సుబ్బయ్యకి గుండె దడపుట్టుకొచ్చింది. వీధిలోకి వచ్చేడు, ఇంట్లో సావిత్రి కొరకొరలాడుతోంది. ఎదటింట్లో మాస్టరు పరిస్థితి ప్రమాదంగా ఉంది. నిరాశచేసుకున్న అతని భార్య అందరి గుండెలూ కరిగేట్టు వెక్కి వెక్కి ఏడుస్తోంది. వీధిలో ఎర్రచీరమనిషి వెళిపోయుండాలి. లేడిపిల్ల కనిపించలేదు.

"ఇవా ళేదో చెడ్డరోజులా తోస్తోంది నాకు"
ఏం జరగనున్నదో ఏమిటో?
ఇవాళో రేపో గవరయ్య ఎర్రకార్లో వస్తాడు.
కోపంతో ఎర్రగా మండిపడతాడు.
ఎవరి దా కారు???
గవరయ్యే—!!! ???
క్షాదు క్షాదు!!!
బతికేను!
కాని గవరయ్యవస్తే ఏంచేసేది?
చేసే దేముంది? పోతాను.
ఆ! పోతాను!
మనోరమ దగ్గరికి పోతాను!
మనోరమ నాకు అండగా నిల్చొంటుంది.

అక్కడకే పోతాను. వళ్లో తలపెట్టుకు పడుక్కుంటాను.

నాకే భయమూ రానివ్వదు మనోరమ.

హబ్బా! గత రాత్రి! హబ్బా!

ఎంత హాయిగా ఉంది! ఆమె నాయం దెంత మక్కువతో ఉంది! ఆమె ఎంత మధురంగా ఉంది!

మనోరమ దగ్గరికిపోతాను.

ఇందాట్లా......

నేనో వెధవని! పరమ దుర్మార్గుణ్ణి!

ఇందాట్లా ఎంతటి దురాలోచన్లు వచ్చేయి!!

నాది పాపిష్టి మనసు. ఎంత అమాయకురాలి గురించి ఎంత అన్యాయంగా తల్చేను!

అయినా ఈరోజు బాగు లేదు.

అంతా చెడ్డగా ఉండేట్టుంది.

అని సుబ్బయ్య ఆలోచిస్తూ ఉండగా పోతన్న వచ్చేడు.

కొత్తదుస్తులు వేసుకున్నాడు పోతన్న. తెల్లటి వంక పాగాచుట్టేడు. నోట్లో పొడుగాటి చుట్టతో తాజాగా వచ్చి.

"దండాలు బాబూ" అన్నాడు.

అప్పుడే పంపించేడు మనిషిని. స్వయంగా రాలేదు. అదీ కొంత నయమే.

"ఏం పోతన్నా, ఏమిటి విశేషాలు?"

"ఏం లేవు బాబూ" అన్నాడు అరుగుమీద కూర్చున్న పోతన్న.

"ఏమంటారు మీ గవరయ్య"

ఆరిపోతూన్న చుట్టని బాగా దమ్ములాగి ఆరిపోకుండా చేసేడు గవరయ్య.

"ఇప్పుడు ఖాళీగా ఉన్నానండి"
"అది కాదోయ్! మీ గవరయ్య......"
"ఏం చేస్తున్నాడో తెలీదండి నాకు"
"ఏం?"
"వాడి కొలువుకి దండం పెట్టి మానేశానండి"
సుబ్బయ్య కొంచెం కలవరపడ్డాడు.
"ఏమీ? ఏమీ?"
"మానేశా నండి"
"ఎందుకు మానేశావు?"
"వాడికీ నాకూ సరిపడలేదండి"
"ఎందుచేత?"

"సరిపడలేదండి. అంతే!"

"సరేలే. కాని, ఎందుచేత సరిపడలేదూ అంట?"

"తత్వాలు వేరయిపోయాయండి."

"ఆఁహాఁ అందుకా?" అనేశాడే కాని సుబ్బయ్యకి గవరయ్య కొలువు అతనెందుకు చాలించుకున్నాడో అర్థంకాలేదు. "సరే! నాకెందుకు? చెప్పడానికి ఇతని కిష్టంలేనట్టుంది" అనుకున్నాడు.

"అయితే ఇహ ఏం చెయ్యదల్చుకున్నావ్"

పొగ వదుల్తూన్న పోతన్న కొంతసేపయాక చెప్పేడు.

"ఏదీ నిశ్చయం చెయ్యలేదండి. ఇంకా నిన్ననే కదా తగువొచ్చింది."

అయితే ఇద్దరికీ తగువొచ్చిందన్న మాట.

"ఎందుగురించోయ్! తగువొచ్చింది?"

పోతన్న చెప్పలేదు.

"ఏదో అయిపోయింది కదా బాబూ! మరి నన్నడక్కండి"

అడక్కండంటే అడక్కూడ దన్నమాటే!

"సరే పోనీ! కాని ఇంతకీ ఇప్పుడేం చెయ్యదల్చుకున్నావ్?"

"చెప్పేను కదా! ఏదీ నిశ్చయంచెయ్ లేదండి"

"అవునవును! సరే సరే"

పోతన్న చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు.

సుబ్బయ్య సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు.

ఎనిమిదిగంటలే అయినా ఎండ జాస్తీగా ఉంది. నీడపట్టున నడిచిపోతున్నారు వీధిలో జనం.

పక్క కిల్లీ దుకాణంవాడు "ప్రేమ" సినీమాలోని సరికొత్త పాటపాడుతున్నాడు.

ఎదటి కిల్లీ దుకాణంవాడు "పెళ్లి చేసిచూడు" లో సరి కొత్త గ్రామఫోన్ రికార్డు పెట్టేడు.

ఈడొచ్చిన పిల్ల అరటిపండు తింటూ రికార్డు వింటోంది.

ఈడురాని పిల్లడు బెంచీమీద కూర్చొని బీడీ కాలుస్తున్నాడు.

వీధిలో ఇప్పుడు అంతా మామూలుగా నేఉంది.

సుబ్బయ్యని మామూలు భయాలు పీడిస్తూనే ఉన్నాయి.

పని మానెయ్యనట్టు పోతన్న మామూలుగానే ఉన్నాడు.

"అయిదువందల సంగతి ఏంచేశారండీ బాబూ" అని అడిగేడు పోతన్న.

"అదేనోయ్ ఆలోచిస్తున్నాను"

పోతన్న 'ఫ్రీ'గా ఉన్నాడు. ఇహ ఇతన్తో 'ఫ్రీ' గా మాట్లాడవచ్చు.

"ఇప్పుడీముట్టుకి అమాంతంగా గవరయ్యొస్తే ఏం జేస్తారు?"

ఏం చేస్తాను?

మనోరమ దగ్గరకి పారిపోతాను.

అటువంటి మనిషి లేదు మరింక.

నామీద ఈగని వాలనివ్వదు.

నేనో వెధవని కాబట్టి ఇందాట్లా అలా భయపడ్డాను.

ఎంతమంచి దెంత మంచిది!!

అక్కడకే పోతాను.

వెళ్లగానే కౌగలించుకొని ముద్దెట్టుకొంటుంది.

వెంటనే వళ్ళో పడుక్కుంటాను.

అక్కడకే, ఆమె యింటికే పోతాను!

గవరయ్యొస్తే ఏంజేస్తాడు?

అయిదువందలూ ఇమ్మని అడుగుతాడు.

అడగనీ, పదిసార్లు, వందసార్లు, వెయ్యిసార్లు, లక్షసార్లు అడగనీ!

నిల్చున్నపాట్న అయిదువంద లివ్వగలనా?

నేనేం జమీందార్నా? కంట్రాక్టర్నా?

అంత సొమ్ము ఇచ్చుకోగల్నా?

ఇవ్వలేనే! ఇవ్వలేను!

ఇచ్చుకోలేక పోయినప్పుడు ఇవ్వకపోతే తప్పేముంది?

ఇవ్వలేను! ఇవ్వను!

ఇవ్వను!!!

గవరయ్య కబురు పంపిస్తే ఇవ్వనని చెప్తాను.

గవరయ్యేవచ్చి అడుగుతే—

ఇవ్వనని చె...కనిపించకుండా పారిపోతాను.

ఆఫీసులో ఎలానూ అడగడు.

పైన నేను కనిపించను.

మనోరమ దగ్గరకి పోతాను.

పోయి పైటవెనక దాగుంటాను.

ఉంగరాల జుత్తులో ఇరుక్కుంటాను.

వళ్ళో పడుక్కుంటాను.

"గవరయ్యడుగుతే సొమ్మివ్వనని చెప్పెయ్యండీ"

పోతన్నకూడా అదే సలహా ఇస్తున్నాడు.

మంచిమాట చెప్పేడు.

మంచి సలహా ఇచ్చేడు.

శాబాస్! పోతన్నా!

"కాని, ఓయ్ పోతన్నా! అలా అనేస్తే గవరయ్య ఏం చేస్తాడంటావు?"

పోతన్న నోట్లోకి పొగపోయి పైకి వచ్చింది.

"ఏం చేస్తాడు? ఏదో ఒకటి చేస్తాడు. అలా భయపడితే పీకలమీదికింకా కూర్చుంటాడు. సొమ్ము మళ్ళీ ఒస్తుందనే ఇచ్చేడా మొదట్లో! నే నెరగని సంగతా ఇదంతా!"

"అవునవును, బాగా చెప్పేవు."

"అంచేత భయపడక 'ఇవ్వన'ని గట్టిగా చెప్పెయ్యండి"

"అలాగే మరి, అలాగే చెప్తా"

"లేకపోతే ఈ శని మిమ్మల్ని వదల్దు మీాసుకోండి"

అని చెప్పి పోతన్న లేచేడు.

"అప్పుడే వెళ్తావా?"

"చిత్తం"

"మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావు?"

"ఇలా వస్తూనే ఉంటాను బాబూ"

"కనిపిస్తూ ఉండు స్మీ"

"కనిపించనా మరి"

అని నడిచేడు పోతన్న. నడుస్తూ సందు మళ్ళి కనిపించకుండా పోయేడు.

అతను ఉన్నంతసేపూ సుబ్బయ్యకి ధైర్యంగా వుంది. భయం ఎరగని మనిషిలా కనిపిస్తాడతను.

"ఈ మనిషి సాయంగా నిల్చుంటే మన కింకే భయమూ ఉండదు" అనేట్టు చేస్తాడు. అతను ఉన్నంతసేపూ ధైర్యంగానే ఉంది. అతను వెళ్లిన తరువాతకూడా కొంతసేపు ధైర్యంగానే ఉంది. కాని మరొక పావుగంటకల్లా అనుమానం భయం తలలెత్తేయి.

"ఇవ్వకపోతే సరి" అని ఇప్పుడు అనుకోడం సులభమే!

అనుకోడం చాలా సులభం.

కాని—

పెద్దపులిలాగ బొర్రు మీాసాల్తో ఎదురుగా గవరయ్య నిల్చున్నప్పుడు ఎల్లా చెప్పడం ఆ మాట!

ఎలాగో ఒలాగ కష్టపడి ఊపిరి బిగబెట్టి చేప్పేస్తా ననుకోండి.

అంతటితో అయిపోలేదే!

అటుతరువాత?—

గవరయ్య ఊరుకుంటాడా?

తల్చుకుంటే గవరయ్య ఎంతటివాణ్ణయినా సరే భస్మం చెయ్యగలడు.

అందుచేత—

కొంతసేపు ఆలోచించేడు సుబ్బయ్య.

మరొక సిగరెట్టు కాల్చి పారేశాడు.

"సరే ఇలా చేద్దాం" అనుకున్నాడు.

పోతన్న చేత కబురు పంపిస్తాను.

నేను గవరయ్య ఎదటపడక్కర్లేదు.

"ఆయన సొమ్మివ్వట్టండి" అని పోతన్న వెళ్ళి చెప్పేస్తాడు.

పోతన్న ఎంతో మంచివాడు. నాకు ఆమాత్రం ఉపకారంచేసి పెట్టకపోడు.

కాని—

తరువాత గవరయ్యని ఎలా తప్పించుకోడం?

రోజూ ఆఫీసుకి వస్తాడు. కాని ఆఫీసులో ఎందుచేతనో ఎడంగా పిల్చి అయినా అడగలేదు నన్ను. తనమీాదకూడా ఏమైనా వస్తుందేమోనని భయంకాబోలు. కాని ఇంటికి రాగలడు. ఇంటికి వచ్చి అల్లరిచేస్తే అప్పుడేంచెయ్యడం?

మనోరమ ఇంటికి పోతాను.

కాని—

గవరయ్య అక్కడకూడా వస్తే??

వస్తే ఇంకేమైనా వుందా!!!

మనోరమ హడిలిపోదూ!!!

అవిణ్ని కూడా అల్లరిచేస్తే చేస్తాడు గవరయ్య.

ఏమిటి సాధనం?

సుబ్బయ్యకేమీ పాలుపోడంలేదు.

ఆఫీసుకి వేళవుతోందని కూడా అతను తెలుసుకోలేదు.

"ఏం బావా! ఆఫీసుకి టైమవుతూన్నట్టుందే" అన్నాడు వెంకట్రావు.

అతనలా అడిగేవరకూ అతను వచ్చినట్టుగా చూడలేదు సుబ్బయ్య.

"ఆ, ఇదిగో, వచ్చేవా! రా కూర్చో"

"కూర్చోడానికి 'టైమ్' లేదు, కాని, నువ్వింకా రాత్రిసంగతిగురించే ఆలోచిస్తున్నావు కదూ?"

"అవునోయ్. అవును మరి"

"ఆలోచనలన్నీ ఎత్తి కట్టేసి నే చెప్పినట్టూ చెయ్యి"

నువ్వు చెప్పినట్టూ చెయ్యబట్టే నా అవస్థ ఇంత మట్టుకొచ్చింది.

"ఏమిటి, నువ్వు చెయ్యమనేది?"

"గవరయ్యకి సొమ్మివ్వకు"

ఇలాటి సలహాలు నేనూ ఇవ్వగలను.

"నన్ను రోజూ అడుగుతున్నాడే"

"అడగనీ"

అడగనీ! సులువుగా అనేశావు. సొమ్ము నువ్వే పట్టుకుపోయేవు. కాని, తెచ్చినది నేను. అందుచేత నిన్నా నన్నా అడుగుతాడు? అడిగేది నిన్ను కాదు కాబట్టి అంత సులభంగా అనేశావు "అడగనీ" అని.

"అడుగుతున్నప్పుడు ఇవ్వనని ఎలా చెప్పడం?"

"నోటితో"

ఛీ! అనుకున్నాడు సుబ్బయ్య తన మనసులో.

ఛీ! ఈలోకంలో ఎవ్వరికీ ఉపకారం అన్నది చెయ్యకూడదు గాక చెయ్యకూడదు.

పోనీకదా అని ఈ మనిషికోసం నోరు విడిచి చెయ్యిజాచి సొమ్ము సంపాదించి తెచ్చి చేతుల్లో పోస్తే, తిరిగి ఆ సొమ్ము ఇవ్వడం మానేసి సిగరెట్టు కాలుస్తూ దర్జాగా "సొమ్ము ఎగ్గొట్టు" అని సలహా ఇస్తున్నాడు.

అంటే అర్థం?

డబ్బుకోసం గవరయ్య నన్ను జెయిల్లో కూర్చోబెట్టినా సరే.

ఇతను, ఈ వెంకట్రావు, నా బావమరిది.

నాకు ఆ సొమ్ము ఇవ్వడన్న మాట!

ఛీ! ఛీ!

"ఛీ! నీకు ధైర్యం లేదోయ్. నీతో ఏం చెప్పినా లాభం లేదు" అన్నాడు మౌనంగా కూర్చొన్న సుబ్బయ్యతో వెంకట్రావు వెళిపోతూ.

సుబ్బయ్యకి దుఃఖం వచ్చింది.

ఈ వెంకట్రావుకి సొమ్ము తిరిగి యిచ్చే ఉద్దేశం లేదు. నాదగ్గర సొమ్ము లేదు. అంతసొమ్ము నాకెవరూ అప్పివ్వరు. ఇచ్చినా తిరువాత తీర్చుకోలేను.

తెచ్చిన సొమ్ము తీరుస్తేనే గాని గవరయ్య ఊరుకోడు.

ఆహా! నుదుటిమీదరాత ఎవడు తప్పించగలడు? ఆరోజు వెంకట్రావు రాకముందు ఎంత హాయిగా ఉన్నాను! ఎంత సుఖంగా నిష్పూచీగా ఉన్నాను! ఈరోజున ఇలా పీకలమీద కత్తితో ఉంటానని కలలో అయినా అనుకున్నానా?

చేతులారా చేసుకొన్నదానికి ఫలితం అనుభవించాలి.

అనుభవింపక తప్పదు.

అటు ఆఫీసులో చూస్తే రివర్షనొచ్చింది.

హెడ్ క్లార్కు పెద్దపులిలాగ మీద పడిపోతున్నాడు.

హబ్బబ్బా! నరకంలో ఉన్నా ఇంతకంటే బావుంటుందేమో!

ఆరోజున పడ్డాను నరకకూపంలో!

ఇహ వేరే నరకం లేదనుకుంటాను!

ఇల్లొక నరకం! ఆఫీసొక నరకం! నా మనసంతా ఓ పెద్ద నరకం!

ఈ నరకంలో నేనెందుకిలా ఉండాలి? కారణం ఏమిటి?

ఏమో! ఎవడు చెప్పగలడు?

ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే ఇహ తెల్లారిపోతుంది.

ఇహ లేచి ఆఫీసుకి పోవాలి.

సుబ్బయ్య లేచి, ఇంట్లోకివెళ్లి కొంతసేపటికి వీధిలోకి వచ్చేడు.

పగలు పదిన్నరగంటలకి వీధిలో మామూలుగా ఎలా ఉంటుందో ఆరోజు అలానే ఉంది.

సుబ్బయ్య రోజూలాగే ఆఫీసుకి వెళ్తున్నాడు.

సుబ్బయ్యలాగ ఎండలో నడిచేవాళ్లు నడుస్తూనే ఉన్నారు. నడవనివాళ్ళు బళ్ళల్లో, రిక్షాల్లో, కార్లలో పోతూనే ఉన్నారు. అంతా మామూలుగానే కనిపిస్తున్నారు.

నేనుకూడా వాళ్ళకి మామోలుగానే కనిపిస్తున్నానా?

అయివుంటుంది.

లేకపోతే వాళ్ళకేం తెలుస్తుంది? నేనెవరో వాళ్ళకేం తెలుస్తుంది?

సుబ్బయ్యనే మనిషి గవరయ్యనే మనిషికి అయిదువందలు ఇవ్వవలసి ఇవ్వలేక బాధపడుతున్నాడని ఈ రోడ్డుమీద పోతూన్నవాళ్ళకేం తెలుసు?

రిక్షాలో వెళ్తూన్నది మంగలేనా?

అవును మంగలే!

Barber, the great !

ఈ బార్బర్‌కి ఈ సుర్బయర్ సంగతి తెలుసా?

ఈ శార్బయ్యకి ఈ సుర్బయ్య సంగతి ఎలా తెలుస్తుంది?

నా శిరోభారమునుదీర్ప నా శిరోజములనుబట్టి చించి కత్తిరించి చెండాడినాడే! కష్టించి ఒడలు వంచి నామెడలు వంచి నా సుదీర్ఘ శిరోజముల ద్రుంచినాడే! గబ్బువాసనతో ధర్మపూరిత ఘర్మ జలముల గబ్బువాసనతో నా నాసారంధ్రముల ద్రేల్చినాడే!

నాకింక పిచ్చెత్తుతుంది.

నాకు బాధగా ఉండే! ఎందుచేత? ఆ మంగలి వాడికి తలనొప్పిగా ఉందా? ఉంటే, ఎందుచేత? ఉండకపోతే, ఎందుచేత?

నా తలలోని బాధలు వాడి నొప్పిఉన్న, లేని, తలకి ఎందుకు తెలియవు?

తలా తలా అంత దగ్గరగావున్నా ఒకరి తల లోనిది ఇంకొకరికి ఎందుకు తెలియదు?

ఎందుచేత తెలియదు?

భగవంతుణ్ని అడగాలి!

అడగడానికి అతడున్నాడా లేదా?

ఈ ప్రశ్నకి జవా బెవర్నడగడం?

అతణ్ణే అడగాలి.

"ఏమయ్యా, సుబ్బన్నా!"

సుబ్బయ్య ఉలిక్కి పడ్డాడు.

ఉత్తరదిక్కుకి గుడ్లుపెట్టి, దక్షిణ దిక్కుకి ముఖం తిప్పిచూస్తూ వచ్చేడు అవధాని.

"నువ్వటోయ్! ఎవరో అనుకున్నాను"

"రామస్వామనుకున్నావేమిటి? అలా తుళ్ళి పడ్డావు?" అన్నాడు అవధాని నవ్వుతూ.

సుబ్బయ్య కెంతమాత్రం నవ్వరాలేదు.

అవధానిమాత్రం అలా కొంతసేపు నవ్వుతూనే నడిచేడు.

నడుస్తూ నడుస్తూ నవ్వలేని సుబ్బయ్య ముఖం లోకి చూసేడు.

"ఏం సుబ్బన్నా, ముఖం వేలేశావ్?"

"నా మనసు బాగులేదోయ్!"

"రామస్వామి తీసిన దెబ్బ ఇంకా మాన్లేదుటోయ్"

అన్నాడు అవధాని కొంటెగా నవ్వుతూ.

"అవునవును. నీకు నవ్వులాటలుగా ఉండదా మరి"

"సరేలే. ఉడుక్కోకు. కాని సుబ్బన్నా ఓమాట. అడుగుతాను?"

"ఓ, అడుగు"

"గవరయ్యని ఆరోజు సొమ్ము అడిగేవు కదా ఎందుకడిగేవు?"

"వెంకట్రావు అడగమన్నాడోయ్! చెప్పేను కదూ నీతో"

"గవరయ్యనే ఎందు కడగమన్నాడో నీకు తెలుసా?"

తెతెతెతె లులులు లిలిలి.

"గవరయ్య బిల్సు నీదగ్గిర అప్పుడు ఉన్నాయి. అవునా?"

"అవునవున్లే"

"అందుచేతనే వెంకట్రావు గవరయ్య నడగమన్నాడని నీకు తెలుసు"

....

"అందుచేతనే అడిగేవు. అడగ్గలిగేవు గవరయ్యని"

"ఏమిటి?"

"డబ్బోయ్! డబ్బు!"

అవధాని ఇవాళ ఇలా ఈరీతిగా తారుమారుగా మాట్లాడుతున్నాడెందుచేత? వ్యాపారం పూర్తిగా మారింది ... హెడ్‌క్లార్కు ఉపదేశించేడా ? ... ఎవర్నీ నమ్మకూడదు...

"సొమ్ము నీకోసం అడగలేదు. నిజమే"

"నాకోసం కానే కాదోయ్!"

"అవును మీ బావమరిదికే ఇచ్చేవు"

"అవునోయ్! వెంకట్రావుకే ఇచ్చేను"

"కాని సొమ్ము గవరయ్య నీకేనా ఇచ్చేడు?"

"అవును"

"ఇవాళ మళ్లీ అడుగు. ఇస్తాడేమో చూద్దాం"

"ఇవా ళెందుకిస్తాడు?"

"ఎందు కివ్వడు?"

బిల్సు నాదగ్గిర లేవు కాబట్టి.

"ఏం మాట్లాడవు? ఇవాళ నీచేతిలో వాడి బిల్సు లేవు. ఆరోజున ఉన్నాయి..."

అవును.

"...అందులో ఏదైనా సదుపాయం చేస్తావని వాడనుకున్నాడు..."

అవును.

"...అలాంటి ఆశ వాడికున్నాదని నీకు తెలుసు."

అవును.

"...అందుకనే వాణ్ణి అయిదువందలడగ్గలిగేవు..."

అవును.

"...వాడే ఉద్దేశంతో సొమ్మిచ్చేడో నీకు తెలుసు..."

అవును.

"...చూడూ! సుబ్బన్నా! మనం అనుకున్నంత అమాయకులం కామోయ్ మనం, సుబ్బన్నా! వాడు వేసిన దొంగలెక్కలన్నీ మభ్యపర్చి వాడికి నువ్వు సదుపాయం ఎప్పుడూ చెయ్యదల్చుకోలేదు. నిజమే! కాని వాడు, పాపం, ఆఉద్దేశంతోటే, అంటే తెలుసుకదూ నీకు,..."

లంచం, లంచం, లంచం.

"...ఆఉద్దేశంతోటే పాపం అయిదువందలూ నీచేతుల్లో పోసేడని నీకు తెలుసు..."

అవునవును!

"కాని వాడి దొంగలెక్కలేవీ కప్పిపుచ్చలేదే నేను!"

"కప్పిపుచ్చలేదు. నిజమే. అంటే, గవర్నమెంటుని దగా చెయ్యలేదు, నిజమే. చేసినదగా గవరయ్యని చేసేవు. అవునా?"

ఈ అవధాని నన్ను దగా చేసేట్టున్నాడు.

"వాడివ్వడమూ తప్పులేదు. నువ్వు పుచ్చుకోడమూ తప్పుకాదు. వాడి కొంచమైనా సదుపాయం—చెయ్యడాని కప్పుడే సీటు మారిందాయను—పోనీ సదుపాయం చెయ్యకపోయినా ఫరవాలేదు. కాని నువ్విలా పసవలా ఉంటేమాత్రం, సుబ్బన్నా, రామస్వామిగాడే కాదు, అంతా హింసిస్తారు నిన్ను. చూసుకో!"

హింస! హింస!

ఇప్పుడు మాటల్తో హింసిస్తున్నావు నన్ను, నువ్వు; మాట్లాడకపోయినా హింసిస్తుంది సావిత్రి.

రామస్వామి రావణాసురుల్లాగ హింసిస్తున్నాడు.

అందర్నీ మించిపోయేడు, గవరయ్య.

హింస! హింస!

"పోనీ, నే నడగడం తప్పేనోయ్!"

"తప్పు కాదోయ్. అడగడం పుచ్చుకోడాల్లో ఏమీ తప్పులేదు"

"అలాక్కాదు, తప్పేఅనుకో. తప్పేఅనుకో. ఒప్పేఅనుకో, అడగడం అడిగేను. ఇవ్వడం అతను ఇచ్చేడు. ఇచ్చినప్పుడూ సొమ్ము మళ్ళీ నా దగ్గర్నుంచి పుచ్చుకుందా మనుకున్నాడా?"

"ఎలా అనుకుంటాడు?"

"కాని ఇప్పుడు చంపేస్తున్నాడోయ్"

"ఎందుకు?"

"అయిదువందలూ తిరిగి ఇచ్చెయ్యమని"

"ఏమిటీ??!! తిరిగి ఇమ్మంటున్నాడా?"

"అవునోయ్"

"'చిత్తం, చిత్తం, దాఖలు చేయించుకుంటాను' అనేశే ఉంటా వీపాటికి, అవునా?"

"అనక ఏంచేసేది?"

"నీలాటి చవటపెద్దమ్మ తప్పించి ఇంకెవడైనా అలా అంటాడా?"

"అనక తప్పింది కాదు"

"అనక తప్పింది కాదేం? ఎందుచేత? ఆడదాని కన్నా అర్థానం అవడంచేత! నీలాటి వెర్రివెధవ ఎక్కడా ఉండడనుకో! ఆ వెధవ, దబాయించడం బాగుంది. నువ్వు హతోస్మి, హతోస్మి, అనడం మరీ బాగుంది..."

"ఏం చెయ్యడం చెప్పూ మరి?"

"ఏం చెయ్యాలా? చెప్పు తీసుక్కొట్టాలి వాణ్ణి నిన్నూకూడాను."

'అదికాదోయ్, అవధానీ! కొంచెం శాంతిద్దూ! కేకలెందుకూ వెయ్యడం? నాకు నీ సలహా కావాలి. కేకలు కాదు"

"కేకల్లు వేస్తానా? ఇంకా వేస్తానా?"

"అబ్బ! నే చెప్పేది వినవోయ్ మరి"

"సరే చెప్పు"

సుబ్బయ్య చెప్పేడు.

"ఇహ ఇవాళో రేపో వచ్చి పీకలమీద కత్తిలా కూర్చుంటాడు" అని ముగించేడు.

అవధాని విన్నాడు.

విన్నాక 'అమ్మ! దొంగవెధవ అంత దౌర్జన్యం చెయ్యబోతున్నాడేం?' అన్నాడు.

"చేస్తున్నాడు"

"నాతో ఇదివరకే ఎందుకు చెప్పేవు కావు?"

"క్షమించు మరి, పొరపాటే అయింది. కాని నన్నిప్పుడు ఏం చెయ్యమంటావో చెప్పు!"

వెంకట్రావునీ, సుబ్బయ్యనీ, గవరయ్యనీ బూతులు తిట్టినపిమ్మట సుబ్బయ్యకి సలహాఇచ్చేడు అవధాని.

"వాడి కొక్క దమ్మిడీ ఇవ్వకు! ఇవ్వనని చెప్పెయ్! వాడేం చేస్తాడో నేమాస్తా. నీమీద దౌర్జన్యం చేస్తే ఆఫీసులో అందరిమీదా చేసినట్లే. అందుచేత "అయిదువందల్లోనూ ఒక్క కాణీ అయినా ఇచ్చేదిలేదు" అని చెప్పు కచ్చితంగా, నీకే 'ఢోకా' రాకుండా నే చూస్తా"

"అంతే నంటావా?"

"అంతే!"

సరే! అవధానికూడా ఇదే సలహా ఇస్తున్నాడు.

సరే! ఇదే బావుంది.

లేస్తా నే అనుకున్నాను సొమ్మివ్వలేనని.

ఇవ్వకివ్వకని చెపుతున్నారు పోతిన్నా, వెంకట్రావూ, అవధానీ.

ఇవ్వనని గవరయ్యతో చెప్పగలనా?

ఇదే వచ్చింది నాతో చిక్కు.

అయినా ఫరవాలేదు! అనేస్తాను!

అవధాని ఆసరా ఉన్నాడు కదా!

అవధాని గట్టివాడు!

గవరయ్యని మింగెయ్యగలడు అమాంతంగా.

గవరయ్యొస్తే చెప్పేస్తాను!!!

10

ఆరోజు సాయంకాలం వీధిలో వేలజనంలో ఒకడుగా సుబ్బయ్య నడుస్తున్నాడు.

తొందర తొందరగా నడుస్తున్నాడు.

తేలిగ్గా తేలిపోతూ పోతున్నాడు.

మాంచి హుషార్గా ఉన్నాడు.

బహు సంతోషంగా ఉన్నాడు.

ఆర్యులారా! చెవులొగ్గి వినుడు!

Please lend me your ears.

వీనుల విందుగా నే చెప్పగా మీరు వినుడు!

—శ్రీరామ రామా! ఒక్క కాణీ ధర్మం ఇప్పించు తండ్రీ.

వినండి! వినండి!

—శ్రీరామ రామా! తండ్రీ! ఒక్క కాణీ...

Hear! Hear!

—......దయ చేయించవా ప్రభూ!

రామరామ శ్రీ రామా రామా రామా రఘురామ

కాణీఅయినా ఇవ్వను యివ్వను అ నేశానండి!

భళా భళీ—

అప్పుడా సుబ్బయ్య దొరవారు ఆసేవ
కాథమునితో ఇంకా ఏమని చెప్పి
నారండీ??

చాలా చెప్పినారండీ!!

"ఒరీ పోతురాజా! నీవుపోయి ఆగవిరిగాడితో
ఈరీతిగా చెప్పుమా—

'కాణీ దమ్మిడి టోలికూడా ఇవ్వడివ్వడంట
అట్టే అడిగేవంటే నీకూ మొట్టికాయలంట
తప్పవు తప్పవు తిట్లూ తన్నులు వారి
చేత నీకు'"

ఓహో సుబ్బయ్యా!

ఆహాహా సుబ్బయ్యా!

ఎంతపని చేశావు?

మంచిపని చేసేవు!

—నేడే ఆఖరిదినం! ఇదే ఆఖరి తరుణం!

"ముగ్గురు యోధుల నే చిత్రరాజాన్ని......

యోధాగ్రేసరుడి వనిపించుకున్నావు.

ఆ నీచాధముడికి గుణపాఠం నేర్పేవు.

—హల్లో న్యూస్ విన్నావా?

—ఏమిటా 'న్యూసు'?

ఏమిటా? నే చెప్తా మీరు వింటే!

కాని ఎలా చెప్పటం వీళ్ళందరితో?

సుబ్బయ్య గవరయ్యల విచిత్ర వృత్తాంతం వీరందరికీ ఎలా తెలియజెయ్యటం?

—ఒరే; నా 'వేయి పడగలు' పుస్తకం ఏదిరా?

—'సారీ' రా బ్రదర్, ఒద్దంటూంటే వినకుండా మా అక్కయ్య షెల్లీ పట్టుకుపోయింది. నీతో చెప్దాం అనుకొంటూ......

అనుకొని అనుకొని ఆఖరికి చెప్పేశాను.

ఎంత గుమ్మగా, ఎంత ఫస్టుగా, ఎంత ధైర్యంగా ఎలా చెప్పేశాను??!!

అరగంట క్రితమే అంతా జరిగింది.

ఆఫీసునుంచి అప్పుడే ఇంటికి వచ్చేడు సుబ్బయ్య. వచ్చేసరికి అప్పటికప్పుడే పోతన్న వచ్చి

వీధి వరాండాలో కూర్చొని చుట్ట కాలుస్తున్నాడు. సుబ్బయ్య ఇంటికివచ్చి ఇంట్లోకి వెళ్ళేడు.

ఆ సమయంలో "సుబ్బయ్యగారూ" అని వీధి లోంచి ఎవరో పిల్చేరు.

పోతన్న ఇంట్లోకి వచ్చేడు.

"నువ్వేనా పిల్చేవు, పోతన్నా?"

"కాదండి—పోతురాజొచ్చేడు"

"పోతురాజెవరు?"

"గవరయ్య మనిషండి"

"సుబ్బయ్యగారూ"—గట్టిగా పిలుపు.

అల్లరి, దెబ్బలాట, తిట్లు, కొట్లు.

"సొమ్ముకోసం ఒచ్చేడు కాబోలోయ్ పోతన్నా!"

"లేకపోతే కులాసాగా ఉన్నారో లేదో కనుక్కుందామని ఒచ్చేడనుకున్నారా?"

"ఏం చెయ్యడమోయ్, పోతన్నా!"

"ఇదెక్కడ వారండీ మీరు!! ఇంకా ఏం చెయ్యడమని చేతులు నులుపుకొంటూ కూర్చుంటారేమిటి? ముందువెళ్ళి వాణ్ణి గెంటెయ్యక"

"పోతన్నా!"

"ఏమిటండీ?"

"పోతన్నా! నాకు భయం వేస్తోందోయ్!

"మాట చెప్పడానికే అలా భయపడితే ఎలాగండీ? ఇంతవరకూ ఎలా కాలక్షేపం చేసుకువస్తున్నారో ఏమిటో ఆశ్చర్యంగా ఉంది. ఇప్పుడు కాని మరి నసిగేరంటే లాభంలేదు. ఇలారండి. నేను పక్కనుంటాను. మరేం ఫర్వాలేదు. సొమ్మివ్వనని చెప్పేసి పోతురాజుని తోలెయ్యండి."అని సుబ్బయ్య రెక్కపట్టుకున్నాడు పోతన్న.

పోతన్న వెనకాతలే వీథిలోకి వచ్చేడు సుబ్బయ్య.

సుబ్బయ్య తల తిరుగుతోంది.

ఎవరో ఏదో చెప్తున్నారు.

"......అడగమన్నా రండి"

"ఎవరు?"

"గవరయ్యగా రండి"

"ఏమని అడిగేరు"

"సొమ్మండి సొమ్ము అడుగుతున్నారండి"

"ఏం సొమ్ము?"

"మీ రిస్తారు పట్టుకురమ్మన్నారండి అయిదు వందలు"

నే నిస్తానని అనలేదే! (అబద్ధం! అబద్ధం!)

"వెంటనే ఇవ్వకపోతే తడాఖా చూద్దువు గాని, అని చెప్పమన్నారండి"

సరే. కాని నేను ఇవ్వలేను, ఇవ్వను, ఇచ్చుకో లేను మరి.

"గవరయ్యగారి సంగతి మీకు తెలియనట్టుందండి."

సుబ్బయ్య ఊరుకున్నాడు.

"గవరయ్య సంగతీ తెలుసు, నీసంగతీ తెలుసు. మరింక నోరుమూసుకొని నీదారన్న నువ్వుపో" అన్నాడు పోతన్న.

"నీతో నేను మాట్లాళ్లేను"

"కాని నేను నీతో మాట్లాడుతున్నాను. మరింక మాటలు మిగలక ఇంటికిపో"

పోతన్న అరుగు దిగినట్లుంది.

పోతురాజు వెళిపోయినట్లుంది.

సుబ్బయ్య తల తిరుగుతున్నట్లుంది.

తిరగడం హెచ్చుతోంది. తగ్గుతోంది.

అంతా జరిగిపోయింది.

ఏది జరగడం అసంభవ మనుకున్నాడో అదే జరిగింది.

నిజంగా జరిగింది.

సుబ్బయ్య గవరయ్యని ధిక్కరించడం జరిగింది.

వచ్చినవాడు గవరయ్య మనిషే అనుకోండి.

పక్కనే పోతిన్న ఉన్నాడనుకోండి.

అయినా, చెప్పింది నేనే.

నానోటితో నేనే చెప్పేను.

మహాద్భుతం! పరమాశ్చర్యం!

నేనే! నేనే!

బలే! బలే!

—ఏయ్ పిల్లా! చల్లగా ఎల్తున్నావు! బండి కింద పడాలనుందేటి?

టకకట టక్టక టకటక టక్టక.

చల్లగా వెళ్ళేపిల్ల బండీవాడివైపు వేడిగా చూసింది.

—తప్పుకోండి బాబూ, తప్పుకోండి.

సుబ్బయ్యా తప్పుకో నేది??!!

నువ్వే తప్పుకో వెధవా!

—ఏం సుబ్బయ్యా ఎక్కడికి వెళ్తున్నావ్?

ఇలా వెళ్తున్నాను—

—ఎక్కడికీ అంట!

ఎందుకో వీడికి? వీడికి నేనా జవాబిచ్చేది?

ఇదిగో ఇలా వెళ్తున్నాను. వస్తాను మరి—

నే నెక్కడికెళ్తే వీళ్ళకెందుకో!

నా ఇష్టంవచ్చినచోటుకి వెళ్తాను.

ఎక్కడికి పడితే అక్కడికి.

ఎప్పుడు పడితే అప్పుడు.

ఇప్పుడు ఎంత వేళయింది చెప్మా?

ఆరున్నరయిందా?

అయివుంటుంది.

అయితే.

మనోరమ స్కూలునుంచి వస్తుందా?

ఇంటిదగ్గర ఉంటుందా?

సింగారించుకొని సిద్ధంగా ఉంటుందా?

నేను వచ్చేనని సంతోషిస్తుందా?

నన్ను కౌగలించుకొంటుందా?

నన్ను ముద్దులాడుతుందా?

వేగిరం వేగిరం.

జల్దీ, జల్దీ.

నడిచి లాభంలేదు.

ఏయ్ రిక్షా—

వేగిరం పద—

ఇది బాగుంది.

సుబ్బయ్యకోసం ఒక సుందరాంగి

ఎదురుచూస్తోందని ఎవరెరుగుదురు?

వెంకట్రావుకి తెలుసా? రామస్వామి ఎరుగునా? అవధాని ఊహించగలడా?

సుబ్బయ్య గట్టివాడు.

ఎలా సంపాదించేడో కాని మంచివాన్ని తెచ్చేడు.

మంచి పిట్టని పట్టేడు.

భేష్! భేష్!

భేషుగ్గా ఉంటుంది!

సుబ్బయ్య అదృష్టవంతుడు.

అపరా, అపరా.

తలుపు తెరిచేవుంది.

ఇంద డబ్బులు.

నాకోసమే...

మరి మాట్లాడక ఫోరా!

తలుపు నాకోసమే తెరిచి వుంచింది.

కాళ్ళు తేలిపోతున్నాయి.

కళ్ళు చెదరిపోతున్నాయి.

గుండెలు ఆగిపోతున్నాయి.

హాదిగో! హాదిగో!

గుమ్మంలో గుమ్మంలో.

మనోరమ! మనోరమ!

తెల్లగా చీర! పచ్చగా రవిక!

చల్లగా చూపు! వచ్చగా నవ్వు!

తెల్లగా పచ్చగా చల్లగా వెచ్చగా.

గుమ్మంలో నిల్చొన్న మనోరమ.

ఎవరికోసం నిల్చొని ఎదురుచూస్తోందో.

వారే వస్తున్నారు!

సుబ్బయ్యగారు వస్తున్నారు.

"మీకోసం చూసిచూసి కళ్లు కాయలు కాసిపోయాయండీ!"

హాదీ హాదీ హాద్దదీ! హాఁదానిష్టాట్లా హుల్లావుండ్హాలి!

"రండి లోపలికి రండి"

రానూ మరీ! ఒస్తున్నా,

వెనక్కి తిరిగి ఇంట్లోకి దారి తీసింది.

నొక్కులు జుత్తులో మల్లెపువ్వులు మందహాసం చేస్తున్నాయి.

ఉల్లాసం కలిగిస్తున్నాయ్.

వెనకాతలే వెళ్ళేడు.

పొడుగ్గా సన్నగా ఇరుగ్గా వాకిలి.

అటూ ఇటూ గదులు.

ఒక్కొక్క గదికి ఒక్కొక్క ద్వారం, ఒక్కొక్క కిటికీ!

అటు పది ద్వారాలు. ఇటు పది కిటికీలు.

గదులనిండా గదు లద్దెకి తీసుకున్న ఆడవాళ్లు.

కొన్ని గదుల్లో ఆడవాళ్ళకి సంబంధించిన కబుర్లు చెప్తూన్న, కాముంతో చూస్తూన్న మొగవాళ్ళు.

వాకిట్లో ఆరవేసిన చీరలు, జాకెట్లు, రవికలు, బాడీలు, పరికిణీలు, తువ్వాళ్ళు, దుప్పట్లు, గలీబులు, గుడ్డలు, ఎన్నెన్నో.

ఇంటినిండా ఆడవాళ్ళు
గడబిడ గలగల
కలకల కిలకిల
కోలాహలం!
ఆడవాళ్ళ కోలాహలం!

కిటికీలలోంచి, గుమ్మాలనుంచి క్యూరియస్ గా చూపులు. కిలకిల నవ్వులు.

ఎవరెవరు? మనోరమే! ఆహాఁ!
కుడిచేతివైపు చివరిగది.
"ఇదే నాగది. లోనికి రండి"
గదిలోపల విద్యుద్దీపం వెలుగుతోంది.
వెలుగులో కనపడుతున్నవి :

పాట్టిముడత మంచం; మంచంమీద మెత్తటి పరుపు? పరుపుమీద తెల్లటిదుప్పటీమీద నల్లటి సిరా మచ్చ, నల్లటి మేజాకాళ్ళు, మేజామీద నీలిగుడ్డ, శకునశాస్త్రము, *What men Think*, రాజా పేదా, ఆంధ్ర వారపత్రిక, అంజలీదేవిబొమ్మ, కనిపించని పుస్తకాలు, ఆఫ్ఘన్ స్నో, పౌడర్ డబ్బా, "6 × 12" అద్దం, ఇంకా ఏవేవో మేజామీద. గోడనిఒక మేకు, మేకుకీ కిటికీకి కట్టిన తాడుమీద పూర్తిగా మాయని బట్టలు. మంచంకింద రెండు ట్రంకు పెట్టెలు, గుమ్మంలో రెండు జతల చెప్పులు.

గదివెనక ఇంకొక చిన్నగది. అందులోకి వెళ్ళడానికి ఇందులోంచి ద్వారం, ద్వారంలోంచి కనిపించేవి ఇత్తడి, ఎల్యూమినియమ్ గిన్నెలు.

గదిలో గోడలకి రెండు బొమ్మల క్యాలెండర్లు, రెండు ఫ్రేం కట్టిన ఫోటోలు.

క్యాలెండర్లెవరివి?

ఒకటి: మహాత్మాగాంధీ; రెండు: నేతాజీబోస్ గాంధీగారి బొమ్మపైన ఒక బుక్ సెల్లర్స్.

నేతాజీబొమ్మమీద ఇంకొకబుక్ సెల్లర్ & స్టేషనర్స్ ఫోటోలు ఎవరివి?

ఒకటి: సన్నగా పల్చగా ఆరోజుల్లో ఉండే మనోరమ.

రెండు: లావుగా నిండుగా ఈరోజుల్లోఉండే మనోరమ.

గదిలో ఇద్దరూ నిల్చున్నారు.
ఒకరికళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు.

"ఇదా మీగది!"
"అవునండీ"
"ఆగదిలో వంట చేసుకుంటారా?"
"అవునండీ"
"ఆవెనక ఏమిటుంది?"
"రండి చూద్దురుగాని"

ఎడంవైపు చివరిగదిలోంచి ఎవరో చూస్తున్నారు.

ముందు గదిలో దీపం ఆర్పేసి వంటగదిలోకి వెళ్ళింది మనోరమ.

వంటగదిలో పొందిగ్గా పేర్చిన గిన్నెలూ, సామాన్లూ లీలగా కనిపిస్తున్నాయి.

"పెరడు చూద్దుగుగాని రండి"
వంటగదిలోంచి పెరట్లోకి వెళ్ళేరు.
పది వాటాలవాళ్ళకీ పది పెరళ్ళు.
పెరట్లోకూడా వాటాకీ వాటాకీ మధ్యగోడ.
ఎవరిపుట్టుకి వారికంతా ఇమ్ముగా ఉంది.
పెరడుకూడా ఇమ్ముగా బాగుంది.

పెరట్లో చంద్రకాంత మొక్కలు వరసగ్గా ఉన్నాయి.

వెల్తిగా వెలిగే చంద్రుడు ఆకాశంలోఉన్నా లేనట్టుగా ఉన్నాడు.

అటువంటి చంద్రుడివైపు చూస్తున్నాయి తెల్ల చంద్రకాంతలు.

ఎర్ర చంద్రకాంతలుకూడా ఆ చంద్రుడివైపే చూస్తున్నాయి.

"చాలా బావున్నాదండీ మీ యిల్లు!"
"ఏదో! ఎలావున్నా చవగ్గా దొరికిందండీ!"
"ఆహా! ఎంత అద్దె?"
"పది"
"బావుందండీ"

"కొంచెం ఇరుగ్గా ఉన్నాదనుకోండి. కాని ఏంచేస్తాం?"

అని ఆవిడ వంగింది, చంద్రుడివైపు చూసే చంద్రకాంతలకోసం.

రెండు పువ్వులు తీసుకొని లేచింది.

రెండు వణుకుతూన్న చేతులు ఆమె భుజాల మీద వెనకనుంచి వాలేయి.

తలమాత్రం వెనక్కి తిప్పి ఆమె నవ్వింది.
తన వీపు అతని గుండెలకి ఆన్చింది.
బరువుగా బరువుగా, హాయిగా హాయిగా,

"వాసన చూడండీ. ఎంత బావుందో!"

కుడిచేత్తో చంద్రకాంతల్ని అతని పెదవుల కాన్చింది.

ఎడంచేత్తో సిగలోని మల్లెపువ్వులు సర్దుకొంది.

మెడ కొంచెం తిప్పి వారగా చూస్తోంది. ఆమె కళ్ళల్లోంచి ఎన్నో భావాలు బైటకి వస్తున్నాయి చిలిపిగా అల్లరిచేస్తూ.

భుజాలమీంచి అతని చేతులు ఆమె నడుంకి రెండువైపులా జారేయి. చేతులకింద నడుం వెచ్చగా ఉంది. వేడిగా సువాసన వేస్తోం దావిడ.

ఘాటుగా లేకుండా మధురంగా ఉన్నాది చంద్రకాంత పువ్వుల వాసన.

ఘాటుగావున్నా మధురంగా ఉన్నాది మల్లె పువ్వుల సువాసన.

"ఏం మనోరమా"

"ఏమండీ"

చంద్రకాంతల్ని ఆమె సిగలో తురిమేడు.

సిగ వెనక్కిపోగా ఆమె ముఖం అతనివైపుకి తిరిగింది.

నవ్వబోయిన పెదవులమీద అతని కంపించే పెదవులు ఆనేయి, తడిగా వేడిగా.

బాగా చీకటి పడింది.

వెల్తిగా వెలిగే చంద్రుడు గర్వంగా చూస్తున్నాడు.

పెరట్లో చంద్రకాంతలు జాలిగా చూస్తున్నాయి.

పక్కింట్లో ఎత్తుగా గుబురుగా ఎదిగిన అంటు మామిడిచెట్టు గూడకుండా నిద్రపోతోంది.

దానిపక్కనే వున్న కొబ్బరిచెట్టు ఆకులన్నీ ముణుచుకొని మూగన్నుతో చూస్తూ పడుకొండికి సిద్ధపడుతోంది.

ఎక్కడో కాని నూతులోంచి నీళ్లు తోడుతూన్న చప్పుడు అవుతోంది.

"శారదా! ఎక్కడున్నావే?" అని ఎక్కడో ఎవరో కేక వేసేరు.

పక్క వాటాలోంచి గాజుల చప్పుడు విన వస్తోంది.

పెదవులాన్చి ఆమెని బలంగా బంధించేడు.

పెరట్లో గోడకి అమర్చిన కొళాయిలోంచి నీటి బొట్లు రాల్తున్నాయి. కొళాయికి ఎడంగా పొట్లపాదు రాతిగోడని పట్టుకొని పైకి లేస్తోంది. పాత న్యూస్ పేపరు ఇసకలో దొర్లుతోంది. మూడు చామంతి మొక్కలు పూతకి సిద్ధంగా ఉన్నాయి. పువ్వులు పూయని గులాబిమొక్కలు రెండు, తొందరగా ఎదిగి పోదామని తాపత్రయపడుతున్నాయి.

తన జీవితంలో అంతకుముందు ఆస్థలం అతను మాడలేదు.

సరికొత్తజాగా అతని కది.

సరికొత్తజాగాలో వయసులో వున్న ఆడమనిషిని కౌగలించుకొని ముద్దులాడ్డం అలవాటులేని మొగవాడికి గాభరాగా వుంటుంది.

సుబ్బయ్య గాభరా పడుతున్నాడు.

కాని అది ఆనందంవల్లనో, భయంచేతనో, కామోద్రేకంచేతనో; ఎందువల్లనో తెలియదతనికి.

గాభరాతో కళ్ళు మూసుకున్నాడు. కొంత సేపు అలానే ఉన్నాడు.

"గదిలోకి పోదాం రండీ" అన్నాది మనోరమ మెల్లిగా.

తక్కువకాలంలో ఎక్కువ చనవు చేసుకున్న ఆడమనిషి, యవ్వనవతి, తలలో మల్లెలూ, చంద్రకాంతలూ తురుముకొని, కళ్ళల్లో చిలిపితనం పెట్టుకొని గదిలోకి రమ్మని ఆహ్వానిస్తే, ఇంకా ఆరి తేరని మొగవాడికి గాభరాగా ఉంటుంది.

సుబ్బయ్య ఆమె అలా అన్నందుకు సిగ్గుపడి, గాభరా పడి మొహమాట పడ్డాడు.

ఇద్దరూ వెళ్ళేరు ఇంట్లోకి.

వంటగదిలో చీకటి.

ముందుగదిలో చీకటి.

ఎదటివాటా చీకటిగదిలోంచి ఎవరో అంత సేపూ చూస్తూనే ఉన్నారు.

"కల్యాణికి వేరే పనే లేదు. అందరిగదుల్లోకీ చూస్తూనే ఉంటుంది అలా. అదేమిటో ఆ సరదా!" అన్నాది మనోరమ మెల్లిగా, చల్లగా తలుపులు వేస్తూ.

కన్నులు తెర్చుకొని కల్యాణి చీకట్లోంచి చూస్తోంది.

చూడకుండా మనోరమ తలుపులు వేస్తోంది.

చీకటి గదిలో పరపురుషుడితో మనోరమ ఏంచేస్తోందో.

కంటితో చూడలేని కల్యాణి ఊహాదృష్టితో చూస్తోంది.

చూడలేక బాధ పడుతోంది.

ఊహించుకొని సంతోషిస్తోంది.

మనోరమ దగ్గరగా వస్తోంది.

దగ్గర దగ్గరగా సవ్వడి లేకుండా వస్తోంది.

గుండెలు కొట్టుకుంటున్నాయి.

జోరుజోరుగా చప్పుడు చేస్తున్నాయి.

మనోరమ వచ్చింది.

రాగలిగినంత దగ్గరగా వచ్చి వీలయినంత దగ్గరగా అతణ్ణి లాక్కుంది.

మొగవాడి మెడచుట్టూ ఆడదాని గాజుల చేతులు. పక్కకింద గుండెల్ని వత్తుకుంటూ రవిక తోసుక్కున్న ఎత్తుగుండెలు. సిగరెట్టు కాల్చే పెదవుల్ని నొక్కుతూ సిగరెట్టు కాల్చని మెత్తమెత్తటి పెదవులు. మెత్తమెత్తటి పెదవులనానక గట్టిగట్టిగా పళ్ళు. కళ్ళల్లోకి కళ్ళు. పెదవులమీద పళ్లు. మెత్తగా గట్టిగా పళ్ళు.

ఆవిణ్ణి పట్టుకున్నాడతను.

అతణ్ణి పట్టుకు వేళ్లాడింది ఆమె.

తూలిపోతున్నాను! తూలిపోతున్నాను!

పడిపోతాను కాబోలు!

ఇంత బరువుగా ఉందేమిటి??!!

నాకన్నా భారంగా బలంగా ఉందే!!

నాకన్నా పెద్దది కాబోలు.

అబ్బ! నాకు నీరసంగా ఉంది.

ఇంత చీకటిగా ఇరుగ్గా ఉందేమిటి ఇక్కడ!

ఉక్క ఉక్క! చెమట చెమట!

ఈమనిషి సత్తువా, ఈమనిషి మోటుతనం, ఈ మనిషి సాహసం చూస్తే భయంగా ఉంది!

కిందని నిల్చొని చేతులు వదిలింది ఆవిడ.

హమ్మయ్యా!

వదిలిం దెలాగయితే నేం?

ఇం కేం చేస్తుందో? నన్నేం చెయ్యమంటుందో?

ఏంచెయ్యడానికీ నాకు మొహం తిరుగుతోంది.

బలవంత పెడుతుంది కాబోలు!

ఏందారి భగవంతుడా.

లైటుకిపోవాలి! ఎలా పోవడం?

ఉక్క పోసేస్తోంది! చెమట! వెధవ చెమట!

రుమాలు మర్చిపోయేను.

శ్రీరామచంద్ర! ఇప్పుడేం చెయ్యడం?

వెర్రివెధవలా ఇలా నిల్చుండి పోయే నే!

నవ్వుతుంది కాబోలు, నవ్వుతూంది కాబోలు.

అయయ్యో! తలవంపులు! సిగ్గుసిగ్గు!

"ఏమండీ సుబ్బయ్యగారూ"

సుబ్బయ్య గొంతుకలో ఏదో అడ్డుపడింది.

"ఏమండీ? అలా నిల్చుండిపోయూరేం? పిలిస్తే పలకరు! నామీద కోపం వచ్చిందా?"

"అబ్బే! అబ్బే!"

"మరే మలా వున్నారు?"

"ఏమీ లేదు, మామోలుగానే ఉన్నానే... కొంచెం ఇక్కడ..."

అతని భుజంమీద చెయ్యి వేసింది మనోరమ.

"అయ్యయ్యో! ఎలా చెమటపట్టేసిందో? కొంచెం విసరనా? అంగుళ్లోనూ అంతదూరం నుంచి నడిచే వచ్చేరో ఏమోకూడా! ఎంతగా అలశారో యేమో! ఇంటికివస్తే కాఫీఅన్నా ఇవ్వకుండా నేను......"

అంటూ లైటు వేసింది మనోరమ.

అతని నుదుటినుంచి శ్వేతబిందువులు రాలున్నాయి.

బట్టలన్నీ తడిసి ముద్దయేయి.

సుబ్బయ్యకి ఎందుకోగాని ఎంతో చిన్నతనం అనిపించింది.

ముఖం దించుకొని నిల్చుండి పోయూడు.

విసనకర్ర తీసుకువచ్చింది మనోరమ.

"ముందు మీరలా మంచంమీద కూర్చోండి"

కూర్చున్నాడు.

అతనికి విసురుతూనే వీవన అతనిచేతికి అందిచ్చి" ఇదిలా తీసుకు విసురుకోండి. ఈలోపున అయిదునిమిషాల్లో కాఫీ చేసి తెస్తా" అన్నాది.

"ఒద్దొద్దు! కాఫీ అక్కర్లేదండీ"

"మీ రెప్పుడూ అలానే అంటారు" అన్నాది మనోరమ నవ్వి, అతని ముఖంమీదకి వంగి, అతని బుగ్గని తాకి.

స్టవ్ వెలిగించిన పదిహేన్నిమిషాల్లో కాఫీ తయారయింది.

సుబ్బయ్యతలలో ఆలోచన్లు అర్థంలేకుండా పరిగెడుతున్నాయి.

ఎందుకు వచ్చేను? ఏం చేస్తున్నాను? చేతకాని వాజమ్మలా కూర్చున్నాను.. ఎవరీవిడ? నా భాగ్య దేవత! అవునా? అయితే "ఏల నింత భయము స్వామి" ఇక్కడ నే నిలా మంచంమీద కూర్చోడం అబద్ధమా

నిజమా? పరువు మెత్తగా ఉంది. మనోరమ బరువుగా ఉంది. ఆడమనిషి అంత బరువుగా ఉండకూడదు. తలుపులు వేసేఉన్నాయి. కల్యాణి చూస్తోందా? కల్యాణి బరువెంత? తలుపులు వేసుకూర్చుంటే అంతా ఏమనుకుంటారో! ఏమో! కొంపతీసి... నేనేం తప్పుపని చేద్దామనిరాలేదే (పచ్చి అబద్ధం) మాటాడదామని వచ్చేను...మనసిచ్చి మాట్లాడేది మనోరమ ఒక్కర్తే. అందుచేన కష్టసుఖాలు చెప్పకుందామని వచ్చేను. ఈరోజుతో గవరయ్య బాధ తీరిందని చెప్దామని వచ్చేను......

"మనోరమా"

"ఇదిగోనండీ కాఫీ"

"థాంక్స్! కాని, మనోరమా! గవరయ్యబాధ వదిలింది!!!"

"ఓహో! నిన్నరాత్రి చెప్పేరు! ఆ గవరయ్యేనా?"

తనుకూడా మంచంమీదకూర్చుంటూ అడిగింది.

"ఆ! వాడే! వాడితో దమ్మిడీ ఇవ్వనని చెప్పేశాను."

అబద్ధం! నువ్వు వాడితో చెప్పలేదు. పోతురాజుతో చెప్పేవు. అంగుకైనా భయపడ్డావు. పోతన్న లేకపోతే చెప్పే లేకపోయేవాడివి.

"మంచిపని చేశారండీ, భేషుగ్గా వుంది"

అతను కాఫీ తాగేడు.

ఆమె కాఫీ తాగింది.

రెండు గ్లాసులు మంచంకిందకి పోయేయి.

ఇద్దరు మనుష్యులు మంచంమీద కూర్చొనే వున్నారు.

వీవనతో అతనికి విసురుతోంది.

తనకి విసురుకొంటోంది.

అతని చెమట అరింది.

ఆతని గాభరా తగ్గింది.

"మనోరమా! నామీద నీకెందు కింత అభిమానం?"

"నాయందు మీకెందు కింత అభిమానమో ముందు మీరు చెప్పండి"

అని ఆవిడ నవ్వింది.

విద్యుద్దీపం వెలుగులో తెల్లగా మెరుస్తోంది. తెల్లగా నవ్వుతోంది. బుగ్గ చిల్లులు మనసు చలింపచేస్తున్నాయి. కట్టుకున్న తెల్లచీర ఇంకా తెల్లగా ఉండి పచ్చ రవికదగ్గర సిగ్గుపడి పక్కకి తప్పుకొంది.

పచ్చగా ఎత్తుగా, పచ్చగా పచ్చగా కళ్ళకి పచ్చగా......

"మనోరమా"

"ఏమండీ''

ఎంత హాయిగా ఎంత హాయిగా ఆడదానిమాట ఎంత హాయిగా, ఆడదానివళ్లు ఎంత హాయిగా ఆడదాని వాసన ఎంత హాయిగా హాయిగా ఆడదానిచీర ఎంత హాయిగా పచ్చగా పచ్చగా చెంపలకి వెచ్చగా వెచ్చగా.

ఆవిణ్ణి దగ్గరకి తీసుకున్నాడు.

ఇంటికి వెళ్లేటప్పుడు కొంతదూరం అమెకూడా వచ్చింది.

వెన్నెల వెన్నెల, పుచ్చపువ్వులా వెన్నెల. చేతుల్లో చెయ్యి చెయ్యి కలిపిన మనోరమ. మృదువుగా హాయిగా, వెన్నెల్లో చల్లటిగాలి హాయ్‌హాయ్ స్వర్గం స్వర్గం. స్వర్గంలా ఉంది.

ఇంకేం కావాలి నాకు!

విడిపోయేముందు "రేపు సాయంకాలం తప్పకుండా ఒస్తారుగా'' అన్నాది మనోరమ.

"రాకుండా ఉండగల ననుకున్నావా?"

"ఏమో" అన్నాదామె కొంటెగా.

చేతిలోఉన్న చేతిని గట్టిగా నొక్కేడు.

"హాస్యానికేంగాని, రేపు సాయంకాలం రావడం మర్చిపోకండేం! మీతో ఓముఖ్య విషయం మాట్లాడాలి"

అన్నాది మనోరమ కొంచెం సీరియస్‌గా.

సుబ్బయ్యకి చలి వేసినట్లయింది.

ఒక్కక్షణం ఆగేక అన్నాడు.

"మర్చిపోను, వస్తాన్లే''

రాత్రి పదిగంటలయింది.

మనోరమ తెల్లచీరా పచ్చరవికా వెన్నెల్లో వెనక్కి వెనక్కి పోయేయి.

సుబ్బయ్య ముందు ముందుకి పోతున్నాడు.

ముఖ్యవిషయం! ముఖ్యవిషయ్యం!

ఆనంద డోలికల్లో వూగిన అతనిమనసు ముఖ్య విషయంగురించి ఆలోచించడంతో భారంగా కుంగిపోతోంది.

ముఖ్యవిషయం! ముఖ్యవిషయం!

పెళ్ళిచేసుకో మంటుందా???

రక్షించు రక్షించు భగవంతుడా!

కల్యాణి చూసింది. ఎంతోమంది చూసేరు.

ఇతనే! ఇతనే!

ఇతనే మా మనోరమని చీకటిగదులోకి తీసుకుపోయేడు!

రక్షించు రక్షించు భగవంతుడా!

మొన్న కాక మొన్న చూసేను. నిన్న కాక నిన్న మాట్లాడేను.

అప్పుడే ఇవాళ......

నిన్ననే ఒప్పుకొనేది......

ఎటువంటి కారెక్టరీ మెది!!

ముఖ్యవిషయం! ముఖ్యవిషయం!

డబ్బు! డబ్బు! డబ్బడుగుతుందేమో!

ఈవిడకీ నాకూ వున్న ముఖ్యవిషయా లేమిటి?

రేపు తప్పక డబ్బిమ్మని అడుగుతుంది.

ఇహ, రోజూ కనిపించినప్పుడల్లా డబ్బడుగుతుంది కాబోలు.

గవరయ్యకి ఇవ్వనక్కర్లేదని నేరకపోయి చెప్పేను.

వాడికి ఇవ్వనక్కర్లేదు కదా!

అందుచేత అయిదువందలూ నాకే ఇవ్వండి అంటుందో ఏమిటో?

చచ్చే నన్నమాటే.

రేపు మరి వెళ్లను.

రేపు సాయంకాలం మరి వెళ్ళను.

మనోరమకి మరి కనిపించను.

కనిపించే నంటే పీకేస్తుంది.

అయిన దేదో అయింది!

చాల్చాలు!!

కాని—

మనోరమకి నాయిల్లు ఎక్కడుందో తెలుసే!!

తిన్నగా ఇంటికి వచ్చేస్తే ఏంచేసేది??

సావిత్రి నన్నుకూడా ఇంట్లోంచి గెంటేస్తుంది.

హరి భగవంతుడా! ఏంచేసేది?

ఇహ బుద్ధి తెచ్చుకుంటాను.

దొంగతనం రంకుతనం చెయ్యొద్దని ఊరికే అన్నారా?

గొప్ప పొరపాటయిపోయింది.

చేతులు కాలేక ఆకులు పట్టుకోడం.

నా సొదంతా చెప్పుకొక్కర్చున్నాను.

ఆమనిషి సంగతేమైనా అడిగేనా?

నేను బుద్ధిలేని వెధవని!

ఇప్పు డింక చేసేదేమీ లేదు.

ఇంటికిపోయి పడుకోవడమే!

రేపుమాత్రం ఆవైపు కయినా వెళ్ళను.

ముఖ్యవిషయాలుట! ముఖ్యవిషయాలు!

వేగిరం ఇంటికిపోతాను!

చాలా ఆలస్యం అయినట్టుందే!

సావిత్రి ఏమంటుందో ఏమిటో?

ఏమనుకున్నా పైకిమాత్రం తేలదు!

ఈపాటికి పడుక్కునుంటారు.

బాగా రాత్రయిందే!

వీధులన్నీ నిర్జనంగా ఉన్నాయ్!

ఒకానొక నిర్జనారణ్యములో ఒక పాంథుడు పోవుచుండగా......

నాకు భయంగా ఉంది.

పండ్లూడిపోయిన ముసలి టక్కరి పులి ఆతనిని చూచి......

వెన్నెల మసకమసక వెన్నెలగా మారిందేం?

ఓరీపాంథా! ఈ పసిడి కంకణమును గొనిపోయి...

పక్కని రాళ్ళకుప్పలు. రోడ్డు బాగులేదే!

రా దగ్గరకురా దీనిని గొనిపొమ్మా...

ఇలాటి రాళ్ళకుప్పమీదే ఆరోజు పడ్డాను.

అమ్మో నాకు భయంగా ఉంది.

అంత నా దుష్టశార్దూలముచే...

ముగ్గురు కొడుతున్నారు నాలుగోమనిషిని.

అమ్మో! అమ్మో!

నా పాంథుడు భక్షింపబడియె.

నాకు భయంగా ఉంది.

తలవంచుకొని ఇంటికి వస్తున్నాడు సుబ్బయ్య.

తన యింటికి కొంచెం ఎడంగా ఆగిన మోటారు కారువైపు చూడలే దతను.

ఇంటిగుమ్మందగ్గర సిగరెట్టు కాలుస్తూన్న మనిషినీ సరిగ్గా చూడలేదు.

"ఏమండోయ్! మీరేనా సుబ్బయ్య"

"ఎవరూ? ఎవరెవరూ? నేనే నేనే నేనే"

"ఆహాఁ! మీరేనా?"

"అవునవును"

"అయితే చూడండీ బాబూ! చిన్నపనుంది ఇలా రండి!"

"పనుందా?"

"అవును"

"ఏమిటో చెప్పండి"

"చెప్తా! ఇలా రండి బాబూ!"

మనిషి బలంగా ఉన్నాడు. ఎత్తుగా జుత్తు. ఎత్తుగా మనిషి. పొట్టిగా నిక్కరు.

నాకు భయంగా ఉంది.

ఒకరాత్రి జనసంచారములేని వీధిలో సోమయ్యనే వృద్ధుడు సుబ్బయ్యనే బాలకుని నడపించుకు పోవుచుండగా...

వీడెవడో నాకు తెలియదే! మనిషి చూస్తే రౌడీలా ఉన్నాడు!

అకస్మాత్తుగా అంధకారమును చీల్చుకొని...

"ఎవరు మీరు? ఏంపని?"

రక్కసులవంటి ముగ్గురు మానుసులు...

"ఇలా రండి బాబూ"

అతను ముందుకి నడుస్తున్నాడు.

నేను రానురాను. నాకు రావడానికి భయంగా ఉంది.

కాని నా పాదాలు ముందుకి పోతున్నాయే! వాటిమీద నాకు స్వాధీనం తప్పినట్టుంది.

"ఏంకావాలో చెప్పవయ్యా వేగిరం?"

అని అడగనా ?

"త్వరగా రండీ"

రానురాను. రా నేరాను.

"వస్తున్నా"

"లోపల కూర్చోండి"

ఇదేమిటిది?

...వచ్చి నిర్దయతో వారిని చావమోదిరి.

మోటారు కారా?

ఎక్కడో చూసేనే!

"కూర్చోండి బాబూ" తలుపు తెరిచేడు అతను.

కార్లోపల ఎవరు కూర్చున్నారు?

ఎర్రెర్రగా సిగరెట్లు వెలుగుతున్నాయే!

ఎర్రగావుందే ఈ కారు!!

"బాబోయ్! నేరాను! బాబోయ్!"

"ఎక్కడకి పోతావ్రా?"

గింయ్ఁ గింయ్ఁ గింయ్ఁ

సుబ్బయ్య కళ్ళు చీకట్లు కమ్మేయి.